సమగ్ర తెలుగు దినపత్రిక
Website: www.adugunews.com
# అడుగు
The Step Towards The Truth..
హైదరాబాద్ | మంగళవారం, 20 మే 2025 | సంపుటి: 01 | సంచిక: 153 | పేజీలు: 4 | వెల: రూ.6:50
Published from Telangana, Andhra Pradesh | చీఫ్ ఎడిటర్: డాక్టర్ మార్గం లక్ష్మీనారాయణ | Mail: adugudaily@gmail.com

## ఆశ్రయమివ్వడానికి భారత్ ధర్మసత్రం కాదు

### శ్రీలంక శరణార్థి అభ్యర్థనను తోసిపుచ్చిన సుప్రీం

న్యూఢిల్లీ,మే19(అడుగు న్యూస్): ప్రపంచంలోని అందరికీ ఉచితంగా ఆశ్రయం ఇవ్వడానికి భారతదేశం ధర్మశాల కాదని సుప్రీంకోర్టు సోమవారం నాడు కీలక వ్యాఖ్యలు చేసింది. శరణార్థిగా తనకు ఇండియాలో ఆశ్రయం ఇవ్వాలని శ్రీలంక జాతీయుడు ఒకరు చేసిన అభ్యర్థనను అత్యున్నత న్యాయస్థానం తోసిపుచ్చింది. లిబరేషన్ టైగర్స్ ఆఫ్ తమిళ్ ఈలంతో


మిగతా 3లో..

## మళ్లీ కోవిడ్ కలకలం

### నటి శిల్పా శిరోద్కర్‌కు పాజిటివ్

ముంబై,మే19(అడుగు న్యూస్): కొత్తగా మరోమారు కోవిడ్ విజృంభిస్తోందన్న వార్తల నేపథ్యంలో తాజాగా కోవిడ్ ఆందోళన కలిగిస్తోంది. తాను కొవిడ్ బారిన పడినట్టు బాలీవుడ్ నటి శిల్పా శిరోద్కర్ తెలిపారు. సోషల్ మీడియా వేదికగా పోస్టు పెట్టారు. జాగ్రత్తగా ఉండాలని, మాస్కులు తప్పనిసరిగా ధరించాలని అభిమానులకు విజ్ఞప్తి చేశారు. శిల్ప త్వరగా కోలుకోవాలని పలువురు అభిమానులు, నెటిజన్లు కామెంట్లు-పెడుతున్నారు. 'కొవిడ్ జర్నీ మళ్లీ

మిగతా 3లో..



'ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రూ.60 వేల కోట్లు రైతుల కోసం ఖర్చు చేసింది. సన్నాలు పండించే రైతులకు మద్దతు ధరతోపాటు రూ.500 బోనస్ అందిస్తున్నాం. వరి వేస్తే ఉరే అనే పరిస్థితుల నుంచి వరి వేస్తే సిరి అనే పరిస్థితులు కల్పించాం' . పేదలందరికీ సన్న బియ్యం అందించి వారి ఆత్మగౌరవం పెంచామని.. రాష్ట్రంలో రూ.3 కోట్ల మంది పేదలకు సన్న బియ్యం అందిస్తున్నట్లు చెప్పారు. 50 లక్షల పేద కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నాం. మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాం. ఆడబిడ్డలను ఆర్టీసీ బస్సులకు యజమానులను చేశాం. వెయ్యి మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తికి స్వయం సహాయక సంఘాల మహిళలకు అప్పగించాం. అదానీ, అంబానీలతో పోటీ పడేలా ఆడబిడ్డలకు ప్రోత్సాహం అందిస్తున్నాం. ఆడబిడ్డలను ఆర్థికంగా నిలబెట్టాలని ప్రణాళికలు రూపొందిస్తూ ముందుకు వెళుతున్నాం' అని ప్రభుత్వ పథకాలను రేవంత్ రెడ్డి వివరించారు. తెలంగాణను దేశంలోనే ధనిక రాష్ట్రంగా తీర్చిదిద్దేలా చర్యలు తీసుకుంటున్నాం.'

-సీఎం రేవంత్ రెడ్డి

# నల్లమల్లకు నగిషీ

## నల్లమల డిక్లరేషన్ ఆవిష్కరణ

- గిరిజనుల సంక్షేమానికి రూ. 12,600కోట్లతో పనులు
- రైతులందరికీ ఉచితంగా సోలార్ పంపుసెట్లు
- ఇందిర సౌర గిరి జల వికాసం' పథకం ప్రారంభం
- నల్లమలను ఆదర్శంగా నిలుపుతానన్న సీఎం రేవంత్
- నల్లమల డిక్లరేషన్ చారిత్రాత్మకం
- గిరిజనుల జీవితాల్లో వెలుగులు నింపేది
- వెయ్యికోట్లతో రాజీవ్ యువ వికాసం ప్రారంభం
- డిప్యూటి సిఎం మల్లు భట్టి విక్రమార్క

అమ్రాబాద్,మే19 (అడుగు న్యూస్): నల్లమల ప్రాంత అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రచిస్తామని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. పోడు భూములను వ్యవసాయానికి అనుకూలంగా మారుస్తున్నామని చెప్పారు. నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం మాచారంలో 'ఇందిర సౌర గిరిజల వికాసం' పథకాన్ని సీఎం ప్రారంభించారు. ఈ సందర్భంగా 'నల్లమల డిక్లరేషన్'ను ఆయన ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన సభలో సీఎం మాట్లాడారు. నల్లమల డిక్లరేషన్ ద్వారా గిరిజనుల సంక్షేమానికి రూ. 12,600 కోట్లతో పనులు చేపడతామని తెలిపారు. అనంతరం నల్లమల ప్రాంతం గురించి సీఎం ప్రసంగించారు. ఒకప్పుడు నల్లమల అంటే

మిగతా 2లో..

# సిటీకి 'టు లెట్'!?

## సెకండ్స్ సేల్స్ ధమాల్!

- ఫస్ట్ సేల్స్ కమాల్! .. 'పాత'కు పాతర!
- 'కొత్త'కు జాతర!.. సన్నగిల్లిన ఆసక్తి!?
- సొమ్మసిల్లిన కొనుగోలు శక్తి!
- శివార్లకు శివాలెత్తుతున్న 'భాగ్య'నగర పౌరులు




'కొత్తొక వింత! పాతొక రోత!!' సర్వ సాధారణమే అయినా, ఇప్పుడు సిటీ సిటిజెన్స్ కి సరిగ్గా సరిపోయే సామెత. సదుపాయమైనా, మరేదైనా సరే, అంతేనా?, 'అంతకు మించి...' అంటున్నారు. కాస్ట్ కాస్త ఎక్కువైనా నో ప్రాబ్లెం.. ఏదైనా ఫస్ట్ ఇన్ ఫస్ట్... ఇప్పుడు ఇదే సిటీ సగటు జీవి ఫాస్ట్ ట్యాగ్... అందుకే సెకండ్స్ కి సేల్స్ పడిపోయింది. అత్యంత పతనావస్థలో సెకండ్స్ సేల్స్ ఉన్నాయి. ఒకప్పుడు మధ్య దిగువ తరగతి ప్రజలకు సెకండ్స్ అంటే ఎగబడేవారు. ఇప్పుడు ఎదురుపడేవారే లేకుండా పోయారు. ఇంతకీ, ఈ మహానగరానికి ఏమైంది? ఎవరో అగంతకులు 'టు లెట్' బోర్డు తగలేశారు!?

అడుగు స్పెషల్ స్టోరీ!

హైదరాబాద్, మే 19 (అడుగు ప్రత్యేక ప్రతినిధి): అవును. ఈ మహానగరానికి మాయరోగం వచ్చింది. ఒకప్పుడు రియల్, బిల్డర్ రంగాల బిల్డప్ పీక్స్ లో ఉన్నప్పటికీ, సెకండ్స్ సేల్స్ ఓ మోస్తరుగానైనా ఉండేది. అదేం విచిత్రమోగానీ, రియల్, బిల్డర్ రంగాలు బొక్కాబోర్లా పడ్డాయి. సరే, ఇప్పుడు పెరగాల్సిన సెకండ్స్ సేల్స్ ధమాల్! మన్నాయి. సప్లయ్, డిమాండ్ ఆర్థిక సూత్రానికి భిన్నంగా, రెండు పడిపోవడం అందరినీ ఆశ్చర్యానికి గురి చేస్తున్నాయి. కొద్దో గొప్పో కొత్త కోసం పాకులాడుతున్న జనాల్ని చూస్తున్నాం. కానీ విస్తారంగా విస్తరిస్తున్న హైదరాబాద్ ట్విన్ సిటీస్ లో సెకండ్స్ కి ఏ మాత్రం గిరాకీ లేకుండా పోయింది. దీంతో ఈ రంగంపై ఆధారపడిన లక్షలాది మంది బ్రోకర్లు లేదా మీడియేటర్లు లేదా రియల్టర్లు ఒక్కసారిగా కుదేలైపోయారు. లబోదిబోమంటున్నారు. అసలీ మహానగరానికి ఏమైందని జుట్టు పీక్కుంటున్నారు. ఎవరో అగంతకులు 'టు లెట్!' బోర్డు పెట్టారని సెటైర్లు వేసుకుంటున్నారు.

గత కొంత కాలంగా హైదరాబాద్ నగరంలో పాత ఇళ్ళు, ఫ్లాట్స్, అపార్ట్‌మెంట్లకు క్రమంగా గిరాకీ తగ్గిపోయింది. కొత్తగా ఇంటి కోసం వెతికే వాళ్ళు ఇప్పుడు పూర్తిగా బ్రాండ్ న్యూ ఫ్లాట్స్ పైనే దృష్టిపెడుతున్నారు. పాత ఇండ్లను కొనాలన్న ఆసక్తి దాదాపు పూర్తిగా తగ్గిపోవడంతో సెకండ్స్ సేల్స్ కి తీవ్ర దెబ్బ తగలింది. ప్రస్తుతం నగరంలోని ప్రముఖ ప్రాంతాలలో వందల సంఖ్యలో పాత ఇళ్లు, ఫ్లాట్స్ అమ్మకానికి సిద్ధంగా ఉన్నా, వాటిని కొనాలన్న మినిమం ఆలోచన కూడా వినియోగదారుల్లో కనిపించడం లేదు.


హిమాయత్‌నగర్ నుంచి తార్నాక వరకు హైదరాబాద్ మహానగరంలో ఖాళీగా ఉన్న పాత ఇండ్లూ, ఫ్లాట్లు వెలవెలపోతున్నాయి. నగరంలోని

మిగతా 3లో..

## జూన్ నుంచి థియేటర్స్ బంద్!

- కీలక నిర్ణయం తీసుకున్న ఎగ్జిబిటర్స్
- అద్దె ప్రాతిపదికన సినిమాలు ప్రదర్శించలేమని వెల్లడి


హైదరాబాద్,మే19(అడుగు న్యూస్): మూవీ లవర్స్‌కు ఇది నిజంగా షాకింగ్ న్యూస్. తెలుగు రాష్ట్రాల్లో జూన్ 1 నుంచి థియేటర్స్ బంద్ కానున్నాయి. ఈ మేరకు మూవీ ఎగ్జిబిటర్స్ కీలక నిర్ణయం తీసుకున్నారు. అద్దె ప్రాతిపదికన సినిమాలు



మిగతా 2లో..

## రాష్ట్రంలో పలువురు డీఎస్పీలు బదిలీ

- 77 మంది డీఎస్పీలకు స్థానచలనం
- కొందరికి కొత్త పోస్టింగులు కేటాయింపు
- డీజీపీ జితేందర్ ఉత్తర్వులు




హైదరాబాద్,మే19(అడుగు న్యూస్): రాష్ట్ర పోలీసు యంత్రాంగంలో సోమవారం భారీ మార్పులు చోటుచేసుకున్నాయి. డీజీపీ జితేందర్ కీలక ఉత్తర్వులు జారీ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా 77 మంది డీఎస్పీ, ఏసీపీ స్థాయి అధికారులను బదిలీ చేశారు. ఈ బదిలీల ప్రక్రియలో భాగంగా కొందరికి నూతన పోస్టింగులు కేటాయించగా, మరికొందరిని డీజీపీ కార్యాలయంలో రిపోర్ట్ చేయాల్సిందిగా ఆదేశించారు.

మిగతా 2లో..

## ప్రమాదస్థలిని ఎందుకు సందర్శించలేదు?

- ప్రజల ప్రాణాలపై కూడా దృష్టిపెట్టరా!
- సీఎం రేవంత్‌పై కెటిఆర్ విమర్శలు




హైదరాబాద్,మే19(అడుగు న్యూస్): అందాల పోటీలకే కాదు సామాన్య ప్రజలకు కడా రక్షణ కల్పించాలని మాజీ మంత్రి, బిఆర్ఎస్ ప్రెసిడెంట్ కెటిఆర్ అన్నారు. పాతబస్తీలోని గుల్జార్ హౌస్ అగ్ని ప్రమాద ఘటన నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై కెటిఆర్ ఫైరయ్యారు. అందాల పోటీల మీద పెట్టే ఖర్చు.. ప్రజల ప్రాణాలు కాపాడడానికి కూడా పెట్టాలని.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఘటనా స్థలానికి వచ్చి బాధితులను పరామర్శించాలని డిమాండ్ చేశారు. పాతబస్తీలో ఆదివారం జరిగిన అగ్నిప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన 17మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ నేపథ్యంలో సోమవారం

మిగతా 3లో..

## యూట్యూబర్ జ్యోతి మల్హోత్రా కేసులో విస్తుపోయే నిజాలు

- దాడికి ముందు పహల్గామ్‌ను సందర్శించినట్లు గుర్తింపు
- వీడియోలు తీసి పాక్‌కు పంపినట్లు నిర్ధారణ
- నిఘా ఏజెంట్లతోనూ జ్యోతి మల్హోత్రాకి సంబంధాలు
- పాక్ హైకమిషన్ వ్యక్తితో కలసి ఉన్న ఫోటోలు గుర్తింపు





న్యూఢిల్లీ,మే19(అడుగు న్యూస్): గూఢచర్యం కేసులో అరెస్టయిన హర్యానాకు చెందిన యూట్యూబర్ జ్యోతి మల్హోత్రా కేసులో విస్తుపోయే విషయాలు వెల్లడయ్యాయి. పహల్గాం ఉగ్రదాడి జరగడానికి కొన్ని నెలల ముందు ఆమె ఆ ప్రాంతాన్ని సందర్శించినట్లు దర్యాప్తులో తేలింది. అంతేకాదు అక్కడ వీడియోలు తీసినట్లు కూడా అధికారులు గుర్తించారు. ఆ వీడియోలను పాక్ ఏజెంట్ల తో పంచుకున్నట్లు భావిస్తున్నారు. దీనిపై అధికారులు మరింత లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. పాకిస్థాన్‌కు సున్నితమైన సమాచారాన్ని చేరవేస్తున్నారన్న ఆరోపణలతో హర్యానాకు చెందిన ట్రావెల్ వ్లాగర్ జ్యోతి మల్హోత్రాను అధికారులు శనివారం అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే.

మిగతా 2లో..

సమగ్ర తెలుగు దినపత్రిక
అడుగు
The Step Towords The Truth..

## సంపాదకీయం
### మార్గం - అడుగు



## గ్రామాలకు గట్టి మేలు తలపెట్టాలి!

గ్రామాలు అభివృద్ధి చెందితేనే, రాష్ట్రం, దేశం అభివృద్ధి చెందుతుందని గాంధీజీ అన్నారు. దాన్నే గ్రామ స్వరాజ్యమని కూడా అంటారు. గ్రామాలు స్వయం సమృద్ధిగా ఎదిగితేనే దేశం కూడా పురోగతి సాధిస్తుంది. మన ప్రజాస్వామిక వ్యవస్థలో దేశంలో మూడంచెలు, స్థానిక సంస్థల్లోనూ మూడంచెల పద్ధతిని ప్రవేశపెట్టారు. దేశం, రాష్ట్రం, గ్రామం ఒక యూనిట్ అయితే, స్థానిక సంస్థల్లో జిల్లా, మండలం, గ్రామం ఒక యూనిట్ గా పరిపాలన సాగుతోంది. అయితే గ్రామాలను పటిష్ట పరచడంలో ప్రభుత్వాలు, పార్టీలు అత్యంత నిర్లక్ష్యం వహిస్తున్నాయి. గ్రామాలను గాలికి వదిలేసి, వాటి పరిపాలన, అభివృద్ధిలో కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు నేరుగా జోక్యం చేసుకుంటున్నాయి. పరిపాలన కంటే కూడా రాజకీయాధిపత్యం పరమావధిగా పార్టీలు, ప్రభుత్వాలు పని చేయడం ఆక్షేపణీయం.

స్థానిక ఎన్నికలను నిర్వహించకుండా ప్రభుత్వాలు కాలం గడిపేస్తున్నాయి. ఎప్పుడు ఎన్నికలు జరుపతారో ఎవరికీ తెలియని అయోమయం నెలకొన్నది. తమకు రాజకీయ పరిస్థితులు అనుకూలంగా ఉంటేనే ఎన్నిక మన్నిక అన్నట్లుగా ఉంది. ఎవరు అధికారంలోకి వచ్చినా స్థానిక సంస్థలను విస్మరిస్తున్నారు. గ్రామాల్లో ఆధిపత్యం తమ చేతుల్లో ఉండేలా చూస్తున్నారు. గ్రామాలు ఆర్థికంగా బలపడడం లేదు. పెత్తనం తమ గుప్పిట్లో పెట్టుకుని సర్పంచ్‌లను డమ్మీలుగా మర్చేస్తున్నారు.

ఏపీలో గత వైసీపీ ప్రభుత్వం సర్పంచ్‌లకు సమాంతరంగా వలంటీర్ల వ్యవస్థను ప్రవేశ పెట్టింది. ప్రస్తుతం టీడీపీ సంకీర్ణ ప్రభుత్వం జన్మభూమి కమిటీలను పెట్టింది. ఇప్పుడు తెలంగాణలో ఇందిరమ్మ కమిటీలను ఏర్పాటు చేశారు. ఇవి సర్పంచ్ ల మీద పెత్తనం చెలాయించే కమిటీలుగా మారాయి. రాజీవ్ గాంధీ స్థానిక ప్రభుత్వాల బలోపేతం కోసం చేసిన రాజ్యాంగ సవరణలను తుంగలో తొక్కుతున్నారు. గ్రామీణ అర్థిక వ్యవస్థకు పట్టుగొమ్మగా ఉన్న గ్రామలను అభివృద్ధి పరచి, సర్పంచ్‌లను బాధ్యులను చేసేలా విధి విధానాలు ఉండటం లేదు. అన్నీ సిఎంల పర్యవేక్షణలో సచివాలయం నుంచే జరగడం వల్ల గ్రామాలు వట్టిపోతున్నాయి. ఆర్థికంగా పంచాయితీలు బలోపేతంగా లేకపోవడంతో పాటు, సర్పంచ్‌లు కూడా బాధ్యతారహితంగా వ్యవహరించడం వల్ల గ్రామాల్లో పక్కాగా ప్రణాళికలు జరగడం లేదు. నేరుగా నిధులు ఇవ్వడం ద్వారా గ్రామాలను బలోపేతం చేయాలని కేంద్రం ఆలోచన చేసినా, రాష్ట్రాల్లో స్థానిక సంస్థల ఎన్నికలు జరగకపోవడం, సర్పంచ్ లు పదవుల్లో ఉంటేనే కేంద్ర నిధులన్న నిబంధనలు అనుకూలించకపోవడంతో గత ఏడాదికిపైగా గ్రామాలు ఆగమైపోతున్నాయి.

గ్రామాలను పటిష్ట పాలనా కేంద్రలుగా తీర్చి దిద్దాల్సి ఉంది. గ్రామం, మండలం, జిల్లా యూనిట్లుగా ఎక్కడికక్కడ పరిపాలన సజావుగా సాగి, స్థానికావసరాలకనుగుణంగా ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తే, ఇవ్వాళ దేశం అద్భుత ప్రగతి పథంలో ఉండేది. సిఎం స్థాయిలో కేవలం పర్యవేక్షణ మాత్రమే ఉండాలి. కార్యక్రమాలు నిరంతరాయంగా జరిగేలా నిబంధనలను పటిష్టం చేయాలి. ప్రభుత్వ పథకాల అమలులో సర్పంచ్‌లను, వార్డు సభ్యులను బాధ్యులను చేస్తే, ఆయా పథకాలు ఆశించన ఫలితాలిచ్చేవి.

ప్రధానంగా గ్రామాల్లో, పట్టణాలు, నగరాల్లో పారిశుధ్యం అత్యంత చెత్తగా అమలవుతున్నది. పారిశుధ్యం పంచాయితీలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు సామాజిక బాధ్యతగా చేయాలి. ఇప్పటికీ ఆరుబయట మల, మూత్ర విసర్జన అన్నది అలవాటుగా కొనసాగుతోంది. వ్యక్తిగత మరుగదొడ్ల నిర్మాణాలు పూర్తి కావడం లేదు. అనారోగ్యాల బారిన పడుతున్నా ప్రజలు ఇందుకు కారణాలు అపరిశుభ్రత అని గ్రహించడం లేదు. వ్యక్తిగత మరుగుదొడ్ల కు 12వేల ఆర్థిక సాయం అందిస్తున్నా గ్రామాల్లో ప్రజలు వెంటనే మరుగదొడ్లు నిర్మించుకునేందుకు ముందుకు రావడం లేదు. దీనికి ప్రజలతో పాటు ప్రభుత్వాల వైఫల్యం కూడా ఉంది. సర్పంచ్‌లకు బాధ్యతలు అప్పగించి గ్రామకమిటీల ద్వారా అమలు చేయాల్సి ఉంది. పారిశుధ్యం, వీధులు శుభ్రంగా ఉంచుకోవడం, చెత్తాచెదారం ఎక్కడపడితే అక్కడ వేయడం, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించడం తదితర అంశాలు సామాజిక బాధ్యత కావాలి. ఈ రకమైన చ్కెతన్యం కోసం ఉద్యమించాల్సి ఉంది. పంచాయతీల్లో జనాభాకు సరిపడా పారిశుద్ధ్య కార్మికులు లేకపోవడంతో పల్లెలో పారిశుద్ధ్యం పడకేసింది.

ఇక ప్రధానంగా అన్ని పనులను ప్రభుత్వమే చేస్తుందన్న ధీమాలో ప్రజలు ఉన్నారు. ప్రభుత్వాలు కూడా మహా ప్రాజెక్టు నుంచి మరుగుదొడ్ల దాకా, ఏదైనా సరే, తమ కనుసన్నల్లోనే జరగాలని, అంతా తమ క్రెడిట్ గా సాగాలని చూస్తున్నాయి. పారిశుధ్యం లోపం, పరిసరాల అపరిశుభ్రత కారణంగానే అత్యధిక వ్యాధులు, అంటు వ్యాధులు ప్రబలుతున్నాయి. అతిసార, కలరా వంటి వ్యాధులు పెచ్చరిల్లుతున్నాయి. మురుగు కాల్వల్ని ఎప్పటికప్పుడు శుభ్రం చేయకపోవడం వల్ల దోమల బెడద తీవ్రం కావడంతో రోగాల బారిన పడుతున్నారు. మలేరియా, డెంగ్యూ విజృంభిస్తోంది. సర్పంచ్‌లు ఉన్నా లేకున్నా ఈ సమస్యలను పెద్దగా పట్టించుకోవడంలేదు.

ఇలాంటి సమస్యలనే ఇప్పుడు అధ్యయనం చేయాలి. గ్రామాలను బలోపేతం చేయాలి. ఓటుబ్యాంక్ రాజకీయాల కారణంగా ప్రజలు అచేతనంగా తయారయ్యారు. సర్పంచ్‌లను, పంచాయితీల పాలకవర్గాలను విశ్వాసంలోకి తీసుకుని వారిని ప్రభుత్వ పథకాల అమలుకు బాధ్యులను చేసినప్పుడే గ్రామాల రూపురేఖలు మారుతాయి. సర్పంచ్‌లకు విధులు, నిధులు అప్పగించాలి. అప్పుడే గ్రామాలు బలపడతాయి. సమీప భవిష్యత్తులోనే స్థానిక ఎన్నికలున్నందున ఈ లోగా ఈ దిశగా ప్రభుత్వాలు ఆలోచించాలి. వట్టి మాటలు కట్టి పెట్టి గ్రామాలకు గట్టి మేలు చేయాలి.

## ఆపరేషన్ సిందూర్‌పై ముందే సమాచారం

### కాంగ్రెస్ విమర్శలను తిప్పికొట్టిన విదేశాంగ శాఖ

న్యూఢిల్లీ,మే19(అడుగు న్యూస్): ఆపరేషన్ సిందూర్ గురించి ముందుగానే సమాచారం ఇవ్వడం వల్ల పాక్ అప్రమత్తం అయ్యిందని కాంగ్రెస్ చేస్తున్న వ్యాఖ్యలను భారత విదేశాంగ శాఖ కొట్టిపడేసింది. ఇది దుష్ప్రచారమని పేర్కొంది. ఇలాంటి వాటితో భారత్ పరువును ప్రతిష్టకు భంగం వాటిల్లగలదని తెలిపింది. ఆపరేషన్ సిందూర్ ప్రారంభించిన తొలి దశలో పాక్ సహా ఇతర దేశాలకు సమాచారం ఇచ్చామని కేంద్ర విదేశాంగ మంత్రి జైశంకర్ తెలిపినట్లు పేర్కొంది. కానీ దాడికి ముందే ఈ సమాచారం బయటకు వెళ్లినట్లు- కాంగ్రెస్ నేతలు అసత్య ఆరోపణలు చేస్తుందని తెలిపింది. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సైతం జైశంకర్‌పై అసత్య ఆరోపణలు చేస్తున్నారని చెప్పింది. భాజపా రాహుల్ వ్యాఖ్యలను తప్పుబట్టింది. రాహుల్ తమ ప్రభుత్వంపై నిందలు మోపాలనే దురుద్దేశంతోనే ఇటు-వంటి వ్యాఖ్యలు చేస్తున్నారని ఆరోపించింది. ఆపరేషన్ సిందూర్‌పై బ్రీఫింగ్ ఇస్తూ.. మిలిటరీ ఆపరేషన్స్ డైరెక్టర్ జనరల్ లెఫ్టినెంట్ జనరల్ రాజీవ్ ఘాయ్ చేసిన ప్రకటనను ఆ పార్టీ ఉటంకించింది. ఆపరేషన్ ప్రారంభించిన వెంటనే తాము ఉగ్రస్థావరాలపై దాడులు చేస్తున్నట్లు- పాక్‌కు చెప్పడానికి ప్రయత్నించగా.. భవిష్యత్తులో ఆ దాడులకు తాము తీవ్ర సమాధానం ఇస్తామని దాయాది దేశం చెప్పినట్లు- లెఫ్టినెంట్ జనరల్ పేర్కొన్నట్లు- భాజపా తెలిపింది. జైశంకర్ విదేశాల్లో ఉన్నప్పుడు కాంగ్రెస్ ఆయనపై ఇటు-వంటి వ్యాఖ్యలు చేయడం సరికాదని మండిపడింది. పీఐబీ సైతం కాంగ్రెస్ ఆరోపణలను తోసిపుచ్చింది. కేంద్రమంత్రి ఈ ప్రకటన చేయలేదని తన ఫ్యాక్ట్‌చెక్‌లో పేర్కొంది.

## నల్లమల్లకు నగిషీ



మొదటిపేజీ తరువాయి..

వెనుకబడిన ప్రాంతం. ఎవరో ఒక నాయకుడు వచ్చి అభివృద్ధి చేయాలని అనేవారని నాటి రోజులను సీఎం గుర్తు చేశారు. సీఎంగా ఇక్కడి నుంచి మాట్లాడుతుంటే తన గుండె ఉప్పొంగిపోతోందన్నారు. ఈ నేపథ్యంలో సీఎం రైతులకు గుడ్ న్యూస్ చెప్పారు. ఇక్కడి రైతులందరికీ ఉచితంగా సోలార్ పంపుసెట్లు ఇస్తామని సీఎం హామీ ఇచ్చారు. వందరోజుల్లో సోలార్ విద్యుత్ మోటార్ అందిస్తామని శుభవార్త చెప్పారు. అచ్చంపేట నియోజకవర్గాన్ని ప్రపంచానికే ఆదర్శంగా మారుస్తామని అన్నారు. దిగ్గజ ప్రాంత వాసినని గర్వంగా చెప్పుకొంటా. కాంగ్రెస్ పార్టీని గెలిపించిన ఈ ప్రాంతం రుణం తీర్చుకుంటున్నా. దేశంలో ఎక్కడ ప్రాజెక్టులు కట్టాలన్నా పాలమూరు వాసులను పిలిచేవారు. ఇక్కడి ప్రజలు కట్టిన ప్రాజెక్టులు నేడు దేశానికి వెన్నెముకగా నిలిచాయి. ఇక్కడి రైతులందరికీ ఉచితంగా సోలార్ పంపుసెట్లు ఇస్తాం. వందరోజుల్లో సోలార్ విద్యుత్ మోటార్ అందిస్తాం. అచ్చంపేట నియోజకవర్గాన్ని ప్రపంచానికే ఆదర్శంగా మారుస్తాం అన్నారు. పహల్గాం ఘటన తర్వాత ప్రధాని అంటే ఇందిరాగాంధీలా ఉండాలనే చర్చ వచ్చింది. ఆమె గతంలో




పాకిస్థాన్‌తో యుద్ధం చేసి ఆ దేశాన్ని రెండు ముక్కలు చేశారు. 50 ఏళ్ల తర్వాత ఇందిరాగాంధీ పేరు చెప్పుకొంటున్నాం. దేశానికి స్వేచ్ఛనిచ్చిందే కాంగ్రెస్. అందరికీ భూములు ఇచ్చి ఆత్మగౌరవం నింపాలన్నది మా పార్టీ నినాదం. ప్రతి ఆదివాసీ గుండెల్లో ఇందిరమ్మ ఉంటుందని రేవంత్ అన్నారు. అనంతరం సతీమణితో సహా సీఎం రేవంత్‌రెడ్డి కొండారెడ్డిపల్లె శ్రీ ఆంజనేయస్వామి ఆలయానికి వెళ్లారు. అక్కడ సీఎం దంపతులు, మంత్రులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సభాపతి గడ్డం ప్రసాద్, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొంగులేని శ్రీనివాస్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, దామోదర రాజనర్సింహా, సీతక్క తదితరులు పాల్గొన్నారు. భూమి కోసం ఈ గడ్డపై పోరాటాలు జరిగాయని తెలంగాణ ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. ఈ రోజు దేశ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగినది అని అన్నారు. అచ్చంపేట నియోజకవర్గంలో ఇందిరా సౌర గిరిజల వికాసం పథకం ప్రారంభ బహిరంగ సభలో డిప్యూటీ- సీఎం ప్రసంగించారు. నల్లమల డిక్లరేషన్ సందర్భంగా భట్టి మాట్లాడుతూ..సంక్షేమం కోసం తెచ్చిన గొప్ప కార్యక్రమం ఇదని, అటవీ సంపద ఫలాలు పూర్తిగా గిరిజనులకే దక్కాలని చెప్పారు. నల్లమల డిక్లరేషన్ ద్వారా గిరిజన కుటుంబాలు అభివృద్ధి చెందుతాయని, భూములే కాదు వాటిని చదును చేసేందుకు నిధులు ఇస్తున్నామని తెలియజేశారు. కాంగ్రెస్ ప్రతి పైసా ప్రజలకే ఖర్చు చేస్తోందని, నిత్యం ప్రజల కోసం ఈ ప్రభుత్వం పని చేస్తోందని పేర్కొన్నారు. గిరిజనులు ఆత్మగౌరవంతో బతకాలనే ఈ కార్యక్రమం తెచ్చామని, తమపై చేసే అనవసర విమర్శలను కుట్రలగానే చూస్తామని అన్నారు. సంపద సృష్టిస్తాం.. సృష్టించిన సంపద పేదలకు పంచుతాం..ఇదే తమ నినాదమని భట్టి చెప్పారు. రూ.వెయ్యి కోట్లతో రాజీవ్ యువ వికాసం ప్రారంభి స్తున్నామని, జూన్ 2 న రాజీవ్ యువ వికాసం పత్రాలు కూడా ఇస్తామని స్పష్టం చేశారు. తెలంగాణ గడ్డపై దశాబ్దాలుగా ఉన్న దున్నేవాడిదే భూమి నినాదాన్ని ఇందిరా సౌర గిరి జిల్లా వికాసం వంటి పథకాల ద్వారా చట్టాలుగా అమలు చేస్తున్నామని భట్టి విక్రమార్క మల్లు అన్నారు.తెలంగాణ గడ్డపై ఉన్న నినాదాలు చట్టాలుగా మారాలంటే మరో 20 ఏళ్లు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉండాలన్నారు. నల్లమల డిక్లరేషన్‌ను తూచా తప్పక పాటించి నాలుగు సంవత్సరాల్లో ఈ రాష్ట్ర గిరిజనులకు ఫలితాలు అందిస్తామని మరోసారి హామీ ఇచ్చారు. ఇందిరా సౌర గిరిజన వికాసం పథకం ప్రారంభం భారతదేశ చరిత్రలో సువర్ణ అక్షరాలతో లిఖించదగిన రోజు.. దేశంలోనే గర్వించదగిన గొప్ప కార్యక్రమమని కొనియాడారు.

గత ప్రభుత్వంలో గిరిజనులు పంట పండించుకోవడానికి వెళితే మహిళలని చూడకుండా చెట్టు-కు కట్టేసి కొట్టారని.. పురుషులపై పోలీసు కేసులు నమోదు చేశారని ఆరోపించారు. రాష్ట్రం అభివృద్ధి చెంద వద్దని, ఫలితాలు ప్రజలకు అందవద్దని నిత్యం ప్రజల కోసం పనిచేసే ప్రభుత్వంపై ఒక మాట అన్న, కుట్ర చేసిన అది రాష్ట్ర ప్రజలపై కుట్రగానే భావిస్తామని భట్టి విక్రమార్క తెలిపారు. జూన్ 2న గిరిజన యువతకు రాజీవ్ యువ వికాసం స్వయం ఉపాధి పథకం ద్వారా 1000 కోట్లు మంజూరు చేయబోతు న్నామని తీపి కబురు చెప్పారు. ఇది పేదల ప్రభుత్వం మన ప్రభుత్వం గుండెల్లో పెట్టు-కొని కాపాడుకోండని పిలుపునిచ్చారు.. ఇందిరా జల వికాసం ఆరంభం మాత్రమే కాబోయే రోజుల్లో అనేక సంక్షేమ పథకాలు అమలు చేయబోతున్నామని చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో యావత్ క్యాబినెట్ రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం పనిచేస్తుందని నల్లమల్ల సాక్షిగా మాట ఇచ్చారు. యంగ్ ఇండియా రెసిడెన్షియల్ పాఠశాలల ద్వారా ఓ ఉమ్మడి కుటుంబాన్ని, అద్భుతమైన సమాజాన్ని నిర్మించ బోతున్నామని తెలిపారు.

కంపెనీలతో పోటీపడేలా శిల్పారామం దగ్గర మహిళలకు స్టాళ్లు ఏర్పాటు చేశామని చెప్పుకొచ్చారు. సన్నబియ్యం లబ్ధిదారుల ఇంటికి స్వయంగా వెళ్లి భోజనం చేసి వచ్చానని గుర్తు చేశారు. నేడు ప్రతి పేదవాడి ఇంటికీ సన్న బియ్యం అందుతోందని తెలిపారు. ఇప్పటి వరకు రైతుల కోసం రూ.60వేల కోట్లు- ఖర్చు చేశామని సీఎం వెల్లడించారు. గతంలో వరి వేస్తే ఉరే అని ఆనాడు అన్నారు.. ఆ దొర మాత్రం వందల ఎకరాల్లో వరి వేసుకున్నారు.. మీరు వరి పండిస్తే బోనస్ ఇస్తామని మేము చెప్తున్నాం.. పేదలకు సన్నబియ్యం ఇస్తున్నాం.. గతంలో దొడ్డు బియ్యం ఇస్తే ఎవరూ తినేవారు కాదు.. రైతులకు గిట్టుబాటు ధర ఇచ్చి ఆదుకున్నాం. నిత్యావసరాల ధరలు తగ్గించడంలో మనమే నంబర్ వన్ అని కేంద్రం చెప్పింది.. శాంతి భద్రతల్లో కూడా మనమే నంబర్ వన్‌లోనే ఉన్నాం.. రాష్ట్ర ఆదాయంలో కూడా తెలంగాణ నంబర్ వన్ అని కేంద్రమే చెప్పింది.. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రైతుల కోసం రూ.60 వేల కోట్లు- ఖర్చు చేశాం అని సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. ఒకప్పుడు నల్లమల అంటే వెనుకబడిన ప్రాంతం. ఎవరో ఒక నాయకుడు వచ్చి అభివృద్ధి చేయాలని అనేవారు. సీఎంగా ఇక్కడి నుంచి మాట్లాడుతుంటే నా గుండె ఉప్పొంగిపోతోంది. పాలమూరు, నల్లమల

## యూట్యూబర్ జ్యోతి మల్హోత్రా కేసులో విస్తుపోయే నిజాలు



మొదటిపేజీ తరువాయి..

పాకిస్థాన్ ఐఎస్ఐతో సంబంధాలున్న న్యూఢిల్లీలోని పాకిస్థాన్ హైకమిషన్ ఉద్యోగి డానిష్‌తో జ్యోతి మల్హోత్రాకు సన్నిహిత సంబంధాలున్నట్లు- తెలిసింది. ఈ కేసు దర్యాప్తులో కీలక విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. పహల్గాం ఉగ్రదాడికి దాదాపు మూడు నెలల ముందు ఆమె తరచూ జమ్ము కశ్మీర్‌లో పర్యటించినట్లు- కూడా అధికారులు గుర్తించారు. ఒకసారి చైనాకు కూడా వెళ్లొచ్చినట్లు- తేలింది. 'ఆపరేషన్ సిందూర్' అనంతరం నెలకొన్న ఉద్రిక్తతల సమయంలో ఆమె డానిష్‌తో టచ్‌లో ఉన్నట్లు- అధికారులు నిర్ధరించారు. జ్యోతిని అతడు ట్రాప్ చేసినట్లు- గుర్తించారు.ట్రావెల్ వ్లాగర్ జ్యోతి.. 'ట్రావెల్ విత్ జో' పేరుతో యూట్యూబ్ ఛానెల్ నడుపుతోంది. కమిషన్ ఏజెంట్ల ద్వారా వీసా పొందిన జ్యోతి 2023లో పాక్‌ను సందర్శించింది. ఆమె ఎవరికీ అనుమానం రాకుండా పాక్ అధికారులకు సున్నితమైన సమాచారాన్ని చేరవేస్తున్నట్లు- తేలింది. ఈ కేసులో జ్యోతి మల్హోత్రా ట్రావెల్ వ్లాగర్‌తో కలిసి పని చేస్తున్నట్లు- గుర్తించారు. మరో ఐదుగురితో కలిసి ముఠాగా ఏర్పడి హర్యానా, పంజాబ్ నుంచి ఇన్ఫార్మర్లుగా వ్యవహరిస్తున్నట్లు- అధికారులు పేర్కొన్నారు. మన దేశంలోని కీలక ప్రాంతాలకు సంబంధించిన సున్నితమైన సమాచారాన్ని పాక్‌తో పంచుకున్నట్లు తేలింది. అంతేకాదు ఓ పాక్ ఇంటెలిజెన్స్ ఆపరేటివ్‌తో సన్నిహితంగా మెలుగుతున్నట్లు- కూడా తేలింది. అతడితో ఆమె అంతర్జాతీయ ట్రిప్‌కు కూడా వెళ్లింది. ఇండోనేషియాలోని బాలికి విహారయాత్రకు వెళ్లి వచ్చినట్లు- దర్యాప్తు అధికారులు తెలిపారు. జ్యోతిపై భారతీయ న్యాయ సంహితలోని సెక్షన్ 152 సహా పలు సెక్షన్ల కింద అభియోగాలు మోపారు. ఇక దర్యాప్తులో తాను తప్పు చేసినట్లు- జ్యోతి రాతపూర్వకంగా అంగీకరించినట్లు- సమాచారం. జ్యోతితోపాటు- మరో ఐదుగురి గుట్టు-ను కూడా అధికారులు బయటపెట్టారు. వారందరినీ అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. పాకిస్తాన్ కు కీలకమైన భారత ఆర్మీ సమాచారాన్ని చేరవేస్తున్నట్లు- గుర్తించి అరెస్ట్ చేసిన హర్యానాకు చెందిన యూట్యూబర్ జ్యోతి మల్హోత్రా గూఢచర్యం కేసులో కొత్త విషయాలు వెలుగులోకి వచ్చాయి. పాకిస్తాన్ నిఘా ఏజెంట్లతో ఆమె సన్నిహితంగా ఉన్న ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. 26 మంది ప్రాణాలను బలిగొన్న పహల్గామ్ ఉగ్రవాద దాడి జరిగిన రెండు రోజుల తర్వాత న్యూఢిల్లీలోని పాకిస్తాన్ హైకమిషన్‌కు కేక్ తీసుకువస్తున్న వ్యక్తితో మల్హోత్రా కలిసి ఉన్న ఓ ఫోటో బయటకొచ్చింది. పాకిస్తాన్ పర్యటన సందర్భంగా.. జ్యోతి తాను హాజరైన పార్టీలో కేక్ తెచ్చిన వ్యక్తిని కలిసినట్లు- ఉన్న ఫోటో ప్రస్తుతం నెట్టింట చక్కర్లు కొడుతోంది. దీంతో జ్యోతిపై అనుమానాలు మరింత బలపడుతున్నాయి. పాకిస్థాన్ ఐఎస్ఐతో సంబంధాలున్న ఆ దేశ హైకమిషన్ ఉద్యోగి డానిష్‌తో జ్యోతికి సన్నిహిత సంబంధాలున్నట్లు- ఇప్పటికే అధికారులు గుర్తించారు. భారత్-పాకిస్తాన్ మధ్య వివాదం తరువాత, పోలీసులు, వివిధ నిఘా సంస్థలు దేశవ్యాప్తంగా సామాజిక వ్యతిరేక శక్తులపై చర్యలను ముమ్మరం చేశాయి. ఈ క్రమంలో పాకిస్తాన్ సహకారంతో గూఢచర్యం చేస్తున్నారనే ఆరోపణలపై యూట్యూబర్ జ్యోతి మల్హోత్రాతోపాటు- ఇప్పటిరకు 11 మందిని పోలీసులు అరెస్టు చేశారు.

## కాళేశ్వరంలో కొనసాగుతున్న పుష్కరాలు

కాళేశ్వరం,మే19(అడుగు న్యూస్): కాళేశ్వరం వద్ద సరస్వతి పుష్కరాలు కొనసాగుతున్నాయి. ఐదోరోజు సోమవారం కూడా భక్తులు పుణ్యస్నానాలకు తరలి వచ్చారు. సోమవారం కావడంతో కాళేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాలుగో రోజైన ఆదివారం సెలవు కావడంతో భారీగా భక్తులు తరలివచ్చారు. త్రివేణి సంగమ పుష్కరిణి ఐదురోజులుగా జనంతో సందడిగా మారింది. తెలంగాణతో పాటు- ఇతర రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులు పరవశించారు. భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి.. శ్రీకాళేశ్వర, ముక్తీశ్వర స్వామివార్లను దర్శించుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. మహిళలు సరస్వతి తీరం వెంట సైకత లింగాలు ఏర్పాటు- చేసి దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు. చీర, సారె సమర్పించి నదిలో దీపాలు వదిలారు. ముత్తయిదువులకు వాయినాలిచ్చి ఆశీర్వచనాలు పొందారు. సాయంత్రం సమయంలో నదీతీరాన సరస్వతి విగ్రహం ముందు నిర్వహించిన మహాహారతి క్రతువును చూసి భక్తులు పరవశించిపోయారు. ఆదివారం పుష్పగిరి పీఠాధిపతి అభినవోద్దండ విద్యాశంకర భారతి మహాస్వామి పుష్కరస్నానం చేసి ఆలయ దర్శనం చేసుకున్నారు.

## రాష్ట్రంలో పలువురు డీఎస్పీలు బదిలీలు

మొదటిపేజీ తరువాయి..

పోలీసు శాఖలో పరిపాలనా సౌలభ్యం కోసం చేపట్టిన ఈ బదిలీల్లో పలువురు కీలక అధికారులకు కొత్త బాధ్యతలు అప్పగించారు. జగిత్యాల సబ్-డివిజనల్ పోలీస్ ఆఫీసర్ (ఎస్డీపీవో)గా ఎన్. వెంకటస్వామి నియమితులయ్యారు. ఇంటెలిజెన్స్ విభాగం డీఎస్పీగా డి. రఘుచందర్‌కు బాధ్యతలు అప్పగించారు.హైదరాబాద్ నగరంలోని కీలక ప్రాంతాల్లో కూడా మార్పులు జరిగాయి. బాలానగర్ ఏసీపీగా పి. నరేశ్ రెడ్డి, శంషాబాద్ ఏసీపీగా వి. శ్రీకాంత్ గౌడ్, మాదాపూర్ ఏసీపీగా సీహెచ్ శ్రీధర్, చిక్కడపల్లి ఏసీపీగా సీహెచ్ శ్రీకాంత్‌లను నియమిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. అదేవిధంగా, మేడ్చల్ ఏసీపీగా సీహెచ్ శంకర్ రెడ్డి, సంతోష్ నగర్ ఏసీపీగా సుఖ్‌దేవ్ సింగ్, మలక్‌పేట ఏసీపీగా సుబ్బరామిరెడ్డి, హుస్నాబాద్ ఏసీపీగా సదానందం, హైదరాబాద్ గాంధీనగర్ ఏసీపీగా ఏ. యాదగిరి బదిలీ అయ్యారు.కొంతమంది అధికారులను ప్రస్తుత స్థానాల నుంచి బదిలీ చేసి, డీజీపీ కార్యాలయంలో తక్షణమే రిపోర్ట్ చేయాల్సిందిగా ఆదేశాలు జారీ అయ్యాయి. వీరిలో చిక్కడపల్లి ఏసీపీగా పనిచేస్తున్న ఎల్. రమేశ్ కుమార్, మేడ్చల్ ఏసీపీ బి. శ్రీనివాస్ రెడ్డి, సంతోష్‌నగర్ ఏసీపీ ఎండీ గౌస్, మలక్‌పేట ఏసీపీ జి. శ్యామ్ సుందర్, హుస్నాబాద్ ఏసీపీ వి. సతీశ్‌లు ఉన్నారు. ఈ బదిలీలు పోలీసు శాఖలో సాధారణ పరిపాలన ప్రక్రియలో భాగంగా జరిగినట్లు తెలుస్తోంది.

## జూన్ నుంచి థియేటర్స్ బంద్!

మొదటిపేజీ తరువాయి..

ప్రదర్శించలేకపోవడంతో థియేటర్స్ బంద్ చేయాలని నిర్ణయించారు. తెలుగు ఫిల్మ్ ఛాంబర్‌లో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ప్రొడ్యూసర్స్ దిల్ రాజు, సురేశ్ బాబు సహా 60 మంది ఎగ్జిబిటర్స్ హాజరయ్యారు. ఎగ్జిబిటర్లు, డిస్ట్రిబ్యూటర్స్ మధ్య చాలాకాలంగా పర్సంటేజీలపై చర్చ సాగుతోంది. రెంటల్ విధానంలో మూవీస్ ప్రదర్శించడం సాధ్యం కాదని ఎగ్జిబిటర్స్ వాదిస్తుంటే.. వారికి పర్సంటేజీలు ఇవ్వలేమని డిస్ట్రిబ్యూటర్స్ తేల్చిచెప్పారు. దీంతో ఇరువురి మధ్య ఆ సమస్య అలాగే ఉండిపోయింది. ఈ వ్యవహారం నిర్మాతలకు సైతం ఇబ్బందిగా మారుతోంది. ఈ క్రమంలో ఏర్పాటైన ఎగ్జిబిటర్ల సంయుక్త సమావేశంలో పర్సంటేజీలు, గవర్నమెంట్ పాలసీలపై చర్చించారు. నిర్మాతలకు లేఖ రాయాలని నిర్ణయించారు.పర్సంటైల్ విధానాన్ని గతంలో 3 భాగాలుగా డివైడ్ చేస్తూ తెలంగాణ ఎగ్జిబిటర్స్ కీలక నిర్ణయం తీసుకున్నారు. రూ.30 కోట్ల కంటే ఎక్కువగా నైజాం హక్కులు కలిగిన సినిమాలకు ఫస్ట్ వీక్ 75 శాతం డిస్ట్రిబ్యూటర్, 25 శాతం ఎగ్జిబిటర్.. సెకండ్ వీక్ 55 శాతం డిస్ట్రిబ్యూటర్, 45 శాతం ఎగ్జిబిటర్.. థర్డ్ వీక్ 40 శాతం డిస్ట్రిబ్యూటర్, 60 శాతం ఎగ్జిబిటర్.. నాలుగో వారం 30 శాతం డిస్ట్రిబ్యూటర్, 70 శాతం ఎగ్జిబిటర్ పర్సంటైల్‌గా ఉండేది. రూ.10 కోట్ల నుంచి రూ.30 కోట్ల వరకూ నైజాం హక్కులు కలిగిన సినిమాలకు ఫస్ట్ వీక్ 60 శాతం డిస్ట్రిబ్యూటర్, 40 శాతం ఎగ్జిబిటర్.. సెకండ్ వీక్ 50 శాతం డిస్ట్రిబ్యూటర్, 50 శాతం ఎగ్జిబిటర్.. థర్డ్ వీక్ 40 శాతం డిస్ట్రిబ్యూటర్, 60 శాతం ఎగ్జిబిటర్.. నాలుగో వారం 30 శాతం డిస్ట్రిబ్యూటర్, 70 శాతం ఎగ్జిబిటర్ పర్సంటైల్‌గా ఉండాలి.రూ.10 కోట్ల లోపు నైజాం హక్కులు కలిగిన సినిమాలకు ఫస్ట్ వీక్ 50 శాతం డిస్ట్రిబ్యూటర్, 50 శాతం ఎగ్జిబిటర్.. సెకండ్ వీక్ 40 శాతం డిస్ట్రిబ్యూటర్, 60 శాతం ఎగ్జిబిటర్.. థర్డ్ వీక్ 30 శాతం డిస్ట్రిబ్యూటర్, 70 శాతం ఎగ్జిబిటర్‌కు ఉండేది. అలాగే.. పెద్ద, మీడియం సినిమాలకు 73 శాతం డిస్ట్రిబ్యూటర్, 27 శాతం ఎగ్జిబిటర్ తీసుకునేలా నిర్ణయించారు. తాజాగా.. ఎగ్జిబిటర్స్, డిస్ట్రిబ్యూటర్స్ మధ్య సమస్య తేలకపోవడంతో థియేటర్స్ బంద్ చేయాలని నిర్ణయించారు. వచ్చే నెల రిలీజ్ అయ్యే మూవీస్‌కు ఈ నిర్ణయం నిజంగా ఇబ్బందే అనే చెప్పాలి. మరోవైపు.. జూన్‌లో భారీ మూవీస్ రిలీజ్ చేసేందుకు మేకర్స్ ప్లాన్ చేశారు. పవర్ స్టార్ ఫ్యాన్స్ ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తోన్న లేటెస్ట్ పీరియాడిక్ యాక్షన్ అడ్వెంచర్ 'హరిహర వీరమల్లు' జూన్ 12న రిలీజ్ కానుంది. అటు.. శేఖర్ కమ్ముల దర్శకత్వంలో ధనుష్, నాగార్జున, రష్మిక ప్రధాన పాత్రలు పోషించిన అవెయిటెడ్ మూవీ 'కుబేర' జూన్ 20న రిలీజ్ కానుంది. ఇక మంచు విష్ణు డ్రీమ్ ప్రాజెక్ట్ 'కన్నప్ప' సైతం జూన్ 27న రిలీజ్ కానున్నట్లు ఇప్పటికే ప్రకటించారు. పాన్ ఇండియా మూవీస్ రిలీజ్ కావాల్సిన టైంలో థియేటర్స్ బంద్ అంటూ ఎగ్జిబిటర్స్ తీసుకున్న నిర్ణయం హాట్ టాపిక్‌గా మారింది.

## మే 22న వరంగల్ కొత్త రైల్వే స్టేషన్ ప్రారంభం

### వర్చువల్‌గా ప్రారంభించనున్న ప్రధాని మోదీ

హైదరాబాద్,మే19(అడుగు న్యూస్): ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మే 22న వరంగల్ రైల్వే స్టేషన్ కొత్త భవనాన్ని వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. తెలంగాణలో రైల్వేల అభివృద్ధికి కేంద్రం కట్టుబడి ఉందని, ఈ ఎజెండాలో భాగంగా రూ.25.41 కోట్లతో వరంగల్ స్టేషన్‌ను అప్‌గ్రేడ్ చేసినట్లు బిజెపి రాష్ట్ర నాయకుడు ఎర్రబెల్లి ప్రదీప్ రావు తెలిపారు. కొత్త భవనాన్ని పరిశీలించిన సందర్భంగా ప్రదీప్ రావు మీడియాతో మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా స్టేషన్లను ఆధునీకరించాలనే ఉద్దేశంతో మోడీ సర్కార్ నిధులను కేటాయిస్తుందని, ఇందులో వరంగల్ ప్రాజెక్ట్ ఒక భాగమని, ప్రయాణికులకు ప్రపంచ స్థాయి సౌకర్యాలను అందిస్తుందని అన్నారు. వరంగల్ రైల్వే స్టేషన్‌లోని సౌకర్యాలలో విశాలమైన ఫుట్ ఓవర్‌బ్రిడ్జి, ఎస్కలేటర్లు, లిఫ్టులు, ర్యాంప్‌లు, ల్యాండ్‌స్కేపింగ్, ఆధునిక ఫుడ్ కోర్టులు, వాణిజ్య సముదాయాలు ఉన్నాయన్నారు. కాగా, వరంగల్ స్టేషన్‌లో నాలుగు ప్లాట్‌ఫారమ్‌లు ఉన్నాయి. రోజుకు 137 రైళ్లు రాకపోకలు కొనసాగుతాయి. ఇది ప్రతిరోజూ సగటున 31,887 మంది ప్రయాణికులకు సేవలందిస్తోంది. ఆధునిక మౌలిక సదుపాయాలు, ఎసి వెయిటింగ్ హాళ్లు, అల్ట్రామోడర్న్ లాంజ్‌లతో సహా రెస్ట్‌రూమ్‌లు, స్టోరేజ్ రూములు, తాగునీటి పాయింట్లు, 24/7 నిఘాతో కూడిన ఎటిఎంలతో అవసరాలను తీర్చడంపై కూడా ప్రత్యేక శ్రద్ధ పెట్టినట్లు ఆయన తెలిపారు.

సమగ్ర తెలుగు దినపత్రిక
అడుగు
The Step Towords The Truth..

# నిరాడంబరతకు ప్రతిరూపం పుచ్చలపల్లి సుందరయ్య

పాలకుర్తి, మే 19(అడుగు న్యూస్): పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్ధంతిని పురస్కరించుకొని పాలకుర్తిలోని ఐలమ్మ స్మారక భవనంలో సిపిఎం నేతలు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కమిటీ సభ్యుడు చిట్యాల సోమన్న, మండల



కార్యదర్శి మాచర్ల సారయ్య మాట్లాడుతూ సుందరయ్య జీవితం అన్ని వర్గాలకు ఆదర్శమన్నారు. కుల వివక్షత, అంటరానితనం నిర్మూలన కోసం నిరంతరం పోరాడిన మహోన్నతుడు సుందరయ్య అని కొనియాడారు. తన కుటుంబ అవసరాలను పక్కనపెట్టి దేశానికి సేవ చేయడమే లక్ష్యంగా జీవించిన నేత అని తెలిపారు. పార్లమెంటుకు సైకిల్‌పై వెళ్లే నిరాడంబర జీవనశైలి నేటి నేతలకు స్ఫూర్తి కావాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు సిపిఎం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఈదురుగాలులకు తెగిపడ్డ హైటెన్షన్ వైరు

## వైరు తగలడంతో టూవీలర్ సహా కాలి బూడిదైన రైతు

ఖమ్మం,మే19(అడుగు న్యూస్): 33/11 కెవి హైటెన్షన్ విద్యుత్ లైన్ తీగ తెగిపడిన విషయాన్ని గమనించక పోవడంతో ద్విచక్ర వాహనంపై వెళుతున్న రైతు అది తాకడంతో విద్యుత్ షాక్ తగిలి దుర్మరణం చెందాడు. ఈ సంఘటన ఖమ్మం జిల్లా, సత్తుపల్లి మండలం, కొత్తూరులో సోమవారం చోటుచేసుకుంది. గ్రామంలో ఆదివారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో భారీగా ఈదురుగాలతోపాటు- భారీ వర్షం కురిసింది. ఆ సమయంలో విద్యుత్ లైన్ తీగ ఒకటి తెగి కింద పడింది. గ్రామానికి చెందిన పైడిమర్ల పెద్ద మురళీ రెడ్డి (59) అనే రైతు సోమవారం ఉదయం ఎప్పటిలాగే ద్విచక్ర వాహనంపై పొలం పనులకు వెళ్లాడు. అయితే, తెగిపడిన విద్యుత్ లైన్‌ను అతను గమనించలేదు. ద్విచక్ర వాహనంపై వెళ్లేందుకు వైరు దాటగా వాహనంతో సహా గుర్తుపట్టని రీతిలో కాలి బూడియ్యాడు. ఈ విషయాన్ని గమనించిన కొందరు రైతులు విద్యుత్ శాఖ అధికారులకు ఫోన్ చేయగా సరఫరా నిలిపివేశారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సత్తుపల్లి ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

# అప్పల బాధతో కుటుంబం అదృశ్యం

సిద్ధపేట,మే19(అడుగు న్యూస్): పట్టణంలో ఓ అనూహ్య సంఘటన చోటు చేసుకుంది. ఖాదర్‌పుర వీధిలో నివసించే ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు అదృశ్యమయ్యారు. ఫోన్లు కూడా ఇంట్లోనే వదిలేశారు. శనివారం ఉదయం నుంచి ఎవరు కనిపించకపోవడంతో ఏదైనా ఊరికి వెళ్లి ఉంటారని బంధువులు, స్థానికులు భావించారు. కానీ, రెండు రోజులైనా ఆచూకీ తెలియకపోవడంతో వారు కంగారు పడ్డారు. దీంతో బంధువులు పోలీస్‌లకు ఫిర్యాదు చేశారు. తమకు అప్పులు ఉన్నాయని.. డబ్బు ఇచ్చేవారు తిరిగి ఇవ్వకపోవడంతో వడ్డీలు కట్టలేక ఇంట్లో నుంచి వెళ్లిపోతున్నాం అని ఆ లేఖ రాశారని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. అదృశ్యమైన వారి వివరాలు వీరబత్తిని బాలకిషన్, తండ్రి జనార్ధన్, భార్య వరలక్ష్మి, కుమారుడు శ్రావణ్, కుమార్తెలు కావ్య, శిరీషగా తెలుస్తోంది. ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. ప్రత్యేక బృందాలుగా ఏర్పడి అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు.

# సమస్యల పరిష్కారం కోసం వెళితే అరెస్టులా?

## సిఎం రేవంత్ తీరుపై మండిపడ్డ హరీష్ రావు

హైదరాబాద్,మే19(అడుగు న్యూస్): తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నాగర్‌కర్నూలు పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డిని కలిసే ప్రయత్నం చేసిన చెంచు సోదరులను అరెస్టు చేయడాన్ని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ నేత హరీశ్‌రావు తీవ్రంగా ఖండించారు. ఇదేనా ప్రజాస్వామ్యం, ఇదేనా మీ సోకాల్డ్ ప్రజాపాలన అని నిలదీశారు. నల్లమల అడవుల నుంచి వచ్చానని గొప్పలు చెప్పుకునే సీఎం రేవంత్ రెడ్డి.. అడవి బిడ్డల సంక్షేమం పట్ల మీకు ఉన్న ప్రేమ ఇదేనా అని హరీశ్‌రావు ప్రశ్నించారు. తమ సంక్షేమం కోసం ఐటీ-డీఏ పీవోగా ప్రత్యేకంగా ఒక ఐఏఎస్ అధికారిని నియమించాలని వారు కోరడం తప్పా అని నిలదీశారు. గత బీఆర్‌ఎస్ పాలనలో ఇచ్చిన పోడుపట్టా భూముల్లో సాగు చేసుకోనివ్వడం లేదనే విషయాన్ని మీకు తెలపాలని రావడమే వారు చేసిన తప్పా అని అడిగారు. తమ ఆరాధ్య దైవాల ద్వారా వచ్చే ఆదాయాన్ని తమ బాగు కోసమే ఖర్చు చేయాలని డిమాండ్ చేయడం వారి తప్పా అని ప్రశ్నించారు. అక్రమంగా అరెస్టు చేసిన చెంచు ప్రతినిధులు మల్లికార్జున్, పద్మ గురువయ్యతోపాటు- అమ్రాబాద్ పోలీసు స్టేషన్ లో నిర్బంధించిన చెంచులను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# తెలంగాణలో పలు జిల్లాల్లో వర్షాలు

హైదరాబాద్,మే19(అడుగు న్యూస్): మరో నాలుగు రోజులపాటు తెలంగాణలో వర్షాలు కురియనున్నాయి. బంగాళాఖాతంలో ఏర్పాడిన ద్రోణి, ఉపరితల ఆవర్తనం ప్రభావంతో మరో నాలుగు రోజులపాటు- తెలంగాణ వ్యాప్తంగా వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ వెల్లడించింది. సోమ, మంగళవారాల్లో అక్కడక్కడా తేలికపాటి వర్షాలు, మరికొన్ని చోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశమున్నట్లు తెలిపింది. నేడు కామారెడ్డి, సంగారెడ్డి, వికారాబాద్, నారాయణ్‌పేట్, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, జోగులాంబ, గద్వాల్ జిల్లాల్లో ఉరుములు మెరుపులు, ఈదురుగాలులతో కూడిన మోస్తరు వర్షాలు, కొన్ని చోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశమున్నట్లు- పేర్కొంది. ఈ మేరకు ఆయా జిల్లాల్లో ఎల్లో అలర్ట్స్ జారీ చేసింది. వర్షాల కారణంగా ఎండ తీవ్రత తగ్గనుంది. పగటిపూట ఉష్ణోగ్రతలు ఐదు డిగ్రీల మేర తగ్గే అవకాశముంది. బంగాళాఖాతం, అరేబియా సముద్రంలో నైరుతి రుతుపవనాలు మరింత వేగంగా విస్తరిస్తున్నాయి. ప్రస్తుతం అండమాన్ నికోబార్ దీవుల్లో రుతుపవనాలు పూర్తిగా విస్తరించి ఉన్నాయి. తొలుత ఈ నెల 27న కేరళ తీరాన్ని తాకుతాయని ఐఎండీ అంచనా వేసింది. అయితే, కాస్త ముందుగా 24నే కేరళ తీరంలోకి ప్రవేశించి, జూన్ మొదటి వారంలోనే తెలంగాణలోకి ప్రవేశించే అవకాశాలు కనిపిస్తున్నాయి.రెండు మూడు రోజుల్లో దక్షిణ అరేబియా, మాల్దీవులు, కొమోరిన్ సహా బంగాళాఖాతం లోని మరిన్ని ప్రాంతాలకు విస్తరించనున్నాయి. మరోవైపు మధ్య మహారాష్ట్ర సహా కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌లోని రాయలసీమ వరకు 0.9 కి.మీ ఎత్తులో ఓ ఉపరితల ద్రోణి కొనసాగుతోంది.

# ఎర్రబెల్లి.. ఇగ కాచుకో..

తొర్రూరు, మే 19(అడుగు న్యూస్): పార్టీ కోసం కష్టపడ్డ ప్రతి కార్యకర్త కుటుంబాలను కంటికి రెప్పలా కాపాడుకుంటానని ఎమ్మెల్యే యశస్విని రెడ్డి అన్నారు. పాలకుర్తి నియోజకవర్గ పరిధిలో తొర్రురు, పెద్దవంగర మండలాల్లో కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్మాణ సన్నాహక సమావేశాలు సోమవారం తొర్రురులో రెడ్డి గార్డెన్, పెద్దవంగరలో సాయి గార్డెన్ లో నిర్వహించగా, ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ హనుమాండ్ల ఝాన్సీ రాజేందర్ రెడ్డి, జిల్లా పరిశీలకులు రవళి రెడ్డి లు పాల్గొని పార్టీ సంస్థాగత నిర్మాణంపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ పార్టీ బలోపేతం కోసం ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు. వారిని కాపాడుకునే బాధ్యత తమదని చెప్పారు. నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ హనుమాండ్ల ఝాన్సీ రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావుపై తీవ్ర విమర్శలు గుప్పించారు. కోవర్టుల ద్వారా కుట్రలు పన్నుతున్నారని ఆరోపించి, తమపై దుష్ప్రచారం ఆపకపోతే దయాకర్ రావును



రాజకీయంగా సమాధి చేస్తామని హెచ్చరించారు. అలాగే గ్రామస్థాయిలో కార్యవర్గాలు ఏర్పాటు చేసి, బూత్ స్థాయిలో కూడా పార్టీని బలంగా మార్చాలని చెప్పారు. పార్టీని వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాల్లో గెలిపించాలి అన్నారు. పార్టీ జిల్లా పరిశీలకులు రవళి రెడ్డి మాట్లాడుతూ యువతను ప్రోత్సహించడంతో పాటు అనుభవజ్ఞుల సహకారంతో పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంగా పని చేయాలని సూచించారు. ఈ సమావేశాలకు మండలంలోని నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు తదితరులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. పాలకుర్తి నియోజకవర్గ కేంద్రంలో గల రైతు వేదికలో పచ్చిరొట్ట పంట జీలుగు విత్తనాలను ఎమ్మెల్యే యశస్విని రెడ్డి సబ్సిడీపై రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, తక్కువ పెట్టుబడి, ఎక్కువ దిగుబడి సాధించేందుకు పచ్చిరొట్ట పంటలు కీలకమని, రైతుల భవిష్యత్ కోసం ఈ రకం విత్తనాలను ప్రోత్సహిస్తున్నామని పేర్కొన్నారు. రాయపర్తి మండలంలోని జగన్నాథపల్లి లో రూ.2.90 కోట్ల వ్యయంతో నిర్మించనున్న 33/11 కేవీ సబ్‌స్టేషన్‌కు ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ హనుమాండ్ల ఝాన్సీ రాజేందర్ రెడ్డి తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు, నాయకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు. పాలకుర్తి మండలం, వల్మిడి గ్రామంలో ముదిరాజ్ కులస్థుల ఆధ్వర్యంలో జరుగుతున్న పెద్దమ్మ తల్లి ప్రతిష్ఠలో పాల్గొని, అమ్మవారికి బోనం సమర్పించి మొక్కులు చెల్లించారు.

# సిటీకి 'టు లెట్'!?

మొదటిపేజీ తరువాయి..

హిమాయత్‌నగర్, గగన్‌మహల్, దోమల్ గూడ, నల్లకుంట, రాంనగర్, ముషీరాబాద్, అశోక్‌నగర్, చిక్కడపల్లి, బేగంపేట, పంజాగుట్ట, అంబర్‌పేట్, సికింద్రాబాద్, మెహదీపట్నం, లక్డీకాపూల్, హైదర్‌గూడ,




తార్నాక, డీడీ కాలనీ వంటి ప్రాంతాల్లో వేలాది పాత ఫ్లాట్లు, ఇండ్లు అమ్మకానికి సిద్ధంగా ఉన్నా కొనుగోలుదారులే కనిపించడం లేదు. ఈ ప్రాంతాల్లో హాజింగ్ స్పేస్ వదిలే వారు పిల్లల చదువులు, పెండ్లిళ్లు, అనారోగ్య ఖర్చుల కోసం అమ్మకానికి పెట్టినా, నెలల తరబడి నిరీక్షిస్తూనే ఉండాల్సి వస్తోంది.

ఒక్క బేగంపేటలో మాత్రమే డిమాండ్ ఇదే సమయంలో బేగంపేటలో మాత్రం పాత ఇండ్లకు గిరాకీ ఉంది. ముఖ్యంగా మార్వాడీ వ్యాపారులు ఈ ప్రాంతంలో గజానికి 10 లక్షల వరకు పెట్టేందుకు కూడా వెనుకాడడం లేదు. కానీ మిగతా ప్రాంతాల్లో మాత్రం పరిస్థితి పూర్తి భిన్నంగా ఉంది. ఒకప్పుడు సెకండ్ సేల్స్‌కు డిమాండ్ ఎక్కువగా ఉండేది. కానీ ఇప్పుడు వినియోగదారులు పాత ఇళ్లను కన్నెత్తి కూడా చూడడం లేదు. కొత్త ఇళ్ల పట్లే ఎక్కువ ఆసక్తి కనబరుస్తున్నారు.

## కొత్తకు స్వాగతం! పాతకు వందనం!!

ఉదాహరణకు హిమాయత్‌నగర్‌లో కొత్త అపార్ట్ మెంట్‌లో ఫ్లాట్ కొనాలంటే 1 ఎస్ఫ్టీకి రూ.12 వేలకు పైగా ధర ఉన్నా సరే, కొనుగోలుదారులు అదేదీ పట్టించుకోకుండా, అవే ఫ్లాట్స్ కావాలని ఎగబడుతున్నారు. అదే పాత ఫ్లాట్ 1




ఎస్ఫ్టీకి రూ.4వేలు అని చెప్పినా ఎవరూ ముందుకు రావడం లేదు. కొన్ని చోట్ల టు లెట్ బోర్డులు పెట్టినా కూడా పట్టించుకునే వారే కరువయ్యారు.

## సిటీ ఔట్స్ పై ఆసక్తి!

నగరంలో రద్దీ బాగా పెరిగి, జనజీవనం ఇరుకైపోయి, ఆక్సీజన్ లేవెల్స్ తగ్గి, ఊపిరాడని ట్రాఫిక్, పెరుగుతున్న కాలుష్యం వంటి సమస్యలతో జనం సతమతమవుతున్నారు. సిటీ జనంలో నగరంలో నివాసం ఉండాలన్న ఉత్సాహం తగ్గిపోతోంది. ప్రజలు ఎక్కువగా సిటీ ఔటర్ రింగు రోడ్ పరిధిలోని గేటెడ్ కమ్యూనిటీలు, విల్లాలు, ఫామ్ హౌస్ లను ఎంపిక చేసుకుంటున్నారు. నగరంలో సొంత ఇల్లు కలిగి ఉన్న వాళ్ళు కూడా ఇప్పుడు వాటిని అమ్మేసి శివారుకు శివాలెత్తుతున్నారు.

## నిరాశలో బ్రోకర్లు %-% వెలవెలబోతున్న వెబ్‌సైట్లు

సిటీలో సెకండ్స్ సేల్స్ పై ఆధారపడిన లక్షలాది మంది బ్రోకర్లు లబోదిబోమంటున్నారు. నెలల తరబడి సేల్స్ లేకపోవడంతో కుటుంబంతో బతకడం




ఎలా? పిల్లల ఫీజులెలా? ఇంటి రెంట్లు ఎలా? అన్న రంధిలో పడ్డారు. 'నో బ్రోకర్', ఇతర ఆన్‌లైన్ వెబ్‌సైట్లలో పాత ఇల్లు, ఫ్లాట్స్ అమ్మకానికి పెట్టినట్టు ప్రకటనలున్నా, వాటిపై స్పందన కనిపించడం లేదు. నెలల తరబడి ఆ ప్రాపర్టీలు అలానే ఉంటున్నాయి.

కొనుగోలుదారులే లేకపోవడంతో, అత్యవసరాల కోసం ఇంటిని విక్రయించాలనుకున్న ఓనర్లు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఏన్నో ఆశలు పెట్టుకున్నా, కనీస మద్దతు ధర కూడా పలకని పరిస్థితుల్లో బెంబేలెత్తున్నారు. హైదరాబాద్ నగరంలో సెకండ్స్ సేల్స్ విభాగం పూర్తిగా పడిపోవడంతో ఈ రంగంలో కొనసాగుతున్న వారు భవిష్యత్ పట్ల భయభ్రాంతులకు లోనవుతున్నారు. సెకండ్స్ సేల్స్ రంగం సమీప భవిష్యత్తులో పుంజుకోకపోతదా!? అన్న ఆశలో ఉన్నారు.

# కబ్జాదారుల పీడ వదిలించిన హైడ్రా

హైదరాబాద్,మే19(అడుగు న్యూస్): భాగ్యనగరంలో మరోసారి హైడ్రా కూల్చివేతలు కొనసాగాయి. హైదర్‌నగర్ లో ఉద్రిక్తతల నడుమ హైడ్రా కూల్చివేతలు జరిగాయి. ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలను హైడ్రా అధికారులు కూల్చివేసారు. దీంతో స్థానికులు, హైడ్రా సిబ్బందికి వాగ్వాదం నెలకొంది. హైదర్‌నగర్‌లో భారీగా పోలీసులు మోహరించారు. కూకట్‌పల్లి పరిధి హైదర్‌నగర్‌లోని డైమండ్ ఎస్టేట్ లేఅవుట్‌ను ఆక్రమణదారుల చెర నుంచి హైడ్రా విడిపించింది. ఇక్కడ ప్లాట్లను కొనుగోలు చేసిన 79 మంది బాధితులకు న్యాయం చేసింది. గత సంవత్సరం సెప్టెంబర్‌లో 79 మంది బాధితులకు ఈ స్థలం చెందుతుందని హైకోర్టు తీర్పునిచ్చింది. అయినా కబ్జాదారులు స్థలాన్ని ఖాళీ చేయకపోవడంతో బాధితులంతా హైడ్రాకు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో ప్లాట్‌లోని యజమానులను కూల్చివేతలను అడ్డుకునేందుకు ప్రయత్నించారు. సోమవారం తెల్లవారుజాము నుంచి హైడ్రా కూల్చివేతలు చేపట్టింది. భారీ పోలీసు బందోబస్తు నడుమ హైదర్‌నగర్‌లో కూల్చివేతలు చేస్తోంది. దాదాపు 20 ఏళ్లుగా కొనసాగుతున్న వివాదానికి హైడ్రా పరిష్కారం చూపినట్లు తెలుస్తోంది. తొమ్మిదిన్నర ఎకరాల విస్తీర్ణంలో ఉన్న 79 మంది ప్లాట్ల ఓనర్లు హైడ్రాకు మద్దతు తెలిపుతూ హర్షం వ్యక్తం చేస్తున్నారు. గత కొన్నేళ్లుగా హైదర్‌నగర్‌లో ఈ స్థలాన్ని ఆక్రమించి పార్కింగ్ పెట్టి డబ్బులు వసూలు చేస్తున్న పరిస్థితి. ఓ ప్రైవేటు- వ్యక్తి ఈ ఆక్రమణలకు పాల్పడటంతో ఆ స్థలం యజమానులు హైకోర్టును ఆశ్రయించారు. దాదాపు 20 ఏళ్లుగా బాధితులు పోరాటం చేస్తున్నారు. చివరకు హైకోర్టు ఆదేశాలతో హైడ్రా రంగంలోకి దిగింది. ఈ భూమికి సంబంధించి ఎనిమిది నెలల క్రితమే తీర్పు వచ్చినప్పటికీ ప్రైవేటు వ్యక్తి ఖాళీ చేయకపోవడంతో హైడ్రా రంగ ప్రవేశం చేసి కూల్చివేతలు చేపట్టింది. హైదర్‌నగర్ నుంచి మియాపూర్ వెళ్లే మార్గంలో కూల్చివేతలు కొనసాగాయి. చుట్టూ షెడ్లను నిర్మించి అక్రమ పార్కింగ్ ఏర్పాటు- చేశారు. ఈ స్థలం అంతా కూడా హెచ్ఎమ్‌డీఏ లే అవుట్‌కు చెందినది. ఈ విషయాన్ని హైడ్రా నిర్ధారించింది. హైడ్రా చీఫ్ రంగనాథ్ ఇటీవల హైదర్‌నగర్‌లో ఆక్రమణలకు గురైె స్థలం వద్దకు వచ్చి పరిశీలించారు. డాక్యుమెంట్లను పరిశీలించిన తర్వాత హైడ్రా సిబ్బంది ఈరోజు నేరుగా కూల్చివేతలు చేపట్టింది. కూల్చివేతల సమయంలో ఈ స్థలాన్ని ఆక్రమించిన వ్యక్తి హైడ్రా సిబ్బందిని అడ్డుకునేందుకు యత్నించాడు. అతడిని వెంటనే అదుపులోకి తీసుకుని కూల్చివేతలు కొనసాగిస్తున్నారు. హైడ్రాకు సంబంధించిన వందలాది మంది సిబ్బందితో హైడ్రా కూల్చివేతలు కొనసాగుతున్నాయి. జేసీబీల సహాయంతో పెద్ద ఎత్తున కూల్చివేతలు చేబడుతోంది.

ఇటీవల కాలంలో హైడ్రా పోలీస్‌స్టేషన్ ఓపెన్ చేసిన తర్వాత మరింత దూకుడు పెంచింది. ఎక్కడైనా అక్రమ నిర్మాణాలు ఉన్నాయనే దానిపై తమ దృష్టికి వస్తే ఫిర్యాదులను స్వీకరించి విచారణ జరిపిన తర్వాత చర్యలు తీసుకుంటామని హైడ్రా చీఫ్ రంగనాథ్ చెబుతున్నారు. కూకట్‌పల్లి మండలం హైదర్‌నగర్ డివిజన్‌లోని సర్వే నెంబర్ 145లో 9 ఎకరాల 27 గుంటల స్థలంలో డైమండ్ ఎస్టేట్స్ లేఅవుట్ విస్తరించింది. ఇందులో మధ్యతరగతి ప్రజలు 79 మంది 2000 సంవత్సరంలో ప్లాట్లు- కొనుగోలు చేశారు. అనంతరం ఆ స్థలం తనదని శివ దుర్గాప్రసాద్ అనే వ్యక్తి మరి కొంతమందితో కలిసి ఆక్రమణకు పాల్పడ్డాడు. అనంతరం ప్లాట్ల యజమానులను స్థలంలోకి రాకుండా హైకోర్టు నుంచి స్టే తీసుకువచ్చారు. దీంతో బాధితులందరూ కోర్టుకు వెళ్లి 2024 సెప్టెంబర్‌లో స్థలాలను దక్కించుకున్నారు. న్యాయస్థానం ప్లాట్ల యజమానులకు అనుకూలంగా తీర్పు ఇచ్చినా కబ్జాదారులు స్థలాన్ని ఖాళీ చేయలేదు. బాధితులను లేఅవుట్‌లోకి రాకుండా అడ్డుకున్నారు. దీంతో వారంతా హైడ్రాకు ప్రజావాణిలో గోడును వెలిబుచ్చారు.

# ఆశ్రయమివ్వడానికి భారత్ ధర్మసత్రం కాదు

మొదటిపేజీ తరువాయి..

సంబంధాలున్నాయనే అనుమానంతో 2015లో పిటిషనర్‌ను అరెస్టు చేశారు. తనను శరణార్థిగా పరిగణించాలని కోరుతూ అతను వేసిన తాజా పిటిషన్‌పై న్యాయ మూర్తులు దీపాంకర్ దత్తా, జస్టిస్ కె.వినోద్ చంద్రతో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. శ్రీలంక జాతీయుడికి 2018లో విచారణ కోర్టు చట్టవిరుద్ధ కార్యకలాపాల నిరోధక చట్టం కింద పదేళ్ల జైలు శిక్ష విధించింది. 2022లో మద్రాసు హైకోర్టు అతని జైలుశిక్షను ఏడేళ్లకు తగ్గించింది. శిక్ష పూర్తికాగానే దేశం విడిచి వెళ్లాలని, దేశం విడిచివెళ్లడానికి ముందు



శరణార్థి శిబిరంలో ఉండాలని ఆదేశించింది. కాగా, సుప్రీంకోర్టులో విచారణ సందర్భంగా పిటిషనర్ తన వాదన వినిపించారు. వీసాతో తాను ఇండియా వచ్చానని, తన ప్రాణాలకు స్వదేశంలో ముప్పు ఉందని కోర్టుకు విన్నవించారు. తన భార్య, పిల్లలు ఇండియాలో స్థిరపడ్డారని, ఇప్పటికి తాను మూడేళ్లుగా నిర్బంధంలో ఉన్నానని, డిపోర్టేషన్ పక్రియ మొదలు కాలేదని చెప్పారు. ప్రపంచం నలుమూలల నుంచి వచ్చే శరణార్థులకు ఆశ్రయం కల్పించేందుకు భారత్ ఉచిత సత్రం కాదని సుప్రీం కోర్టు ఈ సందర్భంగా వ్యాఖ్యానించింది. తాను చట్టబద్ధమైన వీసాపైనే భారత్‌కు వచ్చానని, స్వదేశంలో తన ప్రాణాలకు ముప్పు ఉందని శ్రీలంక వాసి పేర్కొన్నాడు. అంతేగాక, తన భార్యాపిల్లలు ఈ దేశంలోనే సెటిల్ అయ్యారని తెలిపాడు. తనకు ఇక్కడే ఆశ్రయం కల్పించాలని కోరాడు. దీనికి జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ కె. వినోద్ చంద్రన్ ధర్మాసనం స్పందిస్తూ పిటిషనర్‌పై అసహనం వ్యక్తం చేసింది. ప్రపంచం నలుమూలల నుండి వచ్చే శరణార్థులకు భారతదేశం ఆశ్రయం ఇవ్వాలా? ఇప్పటికే మా దేశంలో 140 కోట్ల మంది జనాభా ఉంది. అన్ని దేశాల నుంచి వచ్చే వారిని ఆదరించేందుకు భారత్ ధర్మశాల కాదని ధర్మాసనం స్పష్టం చేసింది. ఇక్కడ సెటిల్ అయ్యేందుకు మీకేం హక్కు ఉందని ప్రశ్నించింది. దీనికి పిటిషనర్ తరఫు న్యాయవాది స్పందిస్తూ.. శ్రీలంకలో అతడి ప్రాణాలకు ముప్పు ఉందని తెలిపారు. అలాగైతే మరో దేశానికి వెళ్లండని సుప్రీం కోర్టు సూచించింది.

# మళ్లీ కోవిడ్ కలకలం

మొదటిపేజీ తరువాయి..



మొదలైందా?' అంటూ సందేహం వ్యక్తం చేస్తున్నారు. సింగపూర్, హాంకాంగ్, థాయ్‌లాండ్..తదితర దేశాల్లో ఇటీ-వల కొవిడ్ కొత్త కేసులు ఎక్కువగా నమోదు కావడం గమనార్హం. మహేశ్‌బాబు సతీమణి నమ్రతా శిరోద్కర్ సోదరి శిల్పా శిరోద్కర్. ఈ బాలీవుడ్ నటి 'బ్రహ్మ' సినిమాతో టాలీవుడ్‌లో అడుగుపెట్టారు. పలు హిందీ సీరియళ్లలో కీలక పాత్రలు పోషించిన ఆమె 'బిగ్‌బాస్ 18' (హిందీ) కంటెస్టెంట్‌గా అందరికీ పరిచయం. ఇదిలావుంటే క్రికెటలర్ ట్రావిస్ హెడ్ కూడా కోవిడ్ బారిన పడ్డట్లు వార్తలు వస్తున్నాయి.

# ప్రమాదస్థలిని ఎందుకు సందర్శించలేదు?

మొదటిపేజీ తరువాయి..

అగ్ని ప్రమాద ప్రదేశానికి వెళ్లి కెటిఆర్ పరిశీలించారు. ఈ సందర్భంగా బాధితులను ఓదార్చారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. ఈ కుటుంబంలో జరిగిన విషాద ఘటన ఇంకొకరికి జరగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ఇంత పెద్ద అగ్ని ప్రమాదం జరిగినప్పుడు అంబులెన్స్‌లో ఆక్సిజన్ మాస్క్ లేకుండా, ఫైర్ ఇంజన్‌లో నీళ్ళు లేకుండా ఘటనా స్థలానికి రావడం వల్లనే మా కుటు-ంబ సభ్యులను కోల్పోయాం అని బాధితులు చెప్తున్నారని అన్నారు. పాతబస్తీలోని గుల్జార్ హౌస్ అగ్ని ప్రమాదంలో మరణించిన వారి కుటు-ంబాలకు రూ.5 లక్షలు కాదు.. రూ.25 లక్షల నష్ట పరిహారం ఇవ్వాలని కెటిఆర్ డిమాండ్ చేశారు. కాగా, ఈ ప్రమాదంపై స్పందించిన ప్రభుత్వం.. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం తరపున రూ.5 లక్షల చొప్పున పరిహారం ఇస్తామని డిప్యూటీ సీఎం భట్టి ప్రకటించారు. చనిపోయిన కుటుంబాలకు.. రూ. 5 లక్షల రూపాయల్ని ఎక్స్ గ్రేషియా ప్రకటించారు. ఈ నేపథ్యంలో ఘటన జరిగినప్పుడు.. ఫైర్ సిబ్బంది సరైన విధంగా స్పందించలేదని బాధితులు ఆరోపిస్తున్నారు. మరోవైపుకు ఘటన స్థలానికి వచ్చిన ఫైర్ ఇంజిన్ లలో.. నీళ్లు కూడా లేవని, ఫైర్ ను ఆర్పివేసే అధునాతన టెక్నాలజీ లేదని బాధితులు మండిపడుతున్నారు. ఫైర్ సిబ్బంది సరైన విధంగా రియాక్ట్ అయితే.. అగ్ని ప్రమాదం ఘటన ఇంత ఎక్కువగా ఉండేది కాదన్నారు. ఈ నేపథ్యంలో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చార్మినార్ ఘటనపై స్పందిస్తు, రేవంత్ పై మండిపడ్డాడు. సీఎం రేవంత్.. అందాల పోటీల మీద మాత్రమే కాకుండా.. అగ్ని ప్రమాదాల మీద కూడా దృష్టి పెట్టాలని సెటైర్ లు వేశారు. అగ్ని ప్రమాదంలో మరో ప్రాణం పోకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వం మీద ఉందని చెప్పుకొచ్చారు. తమ పార్టీ దీనిపై.. రాజకీయంగా మాట్లాడడానికి రాలేదన్నారు. ప్రభుత్వాలు ప్రజల ప్రాణాలు కాపాడాలన్నారు. ఐదు లక్షల పరిహారం ఇచ్చి చేతులు దుల్పుకోవడం కాదు.. ప్రాణాలపై దృష్టి పెట్టాలన్నారు. బాధితులకు ఇచ్చిన పరిహారం ఏమాత్రం న్యాయంగా లేదని.. 25 లక్షలు ఎక్స్గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు.ముఖ్యమంత్రే హెూమ్ మినిస్టర్ గా ఉన్నారు కాబట్టి ఘటన స్థలానికి వచ్చి ఉంటే అధికారులు ఇంకా బాగా పనిచేసేవారన్నారు. సమ్మర్ వచ్చే ముందు అగ్నిమాపక సిబ్బందితో ప్రభుత్వం సమీక్ష సమావేశాలు నిర్వహించాలన్నారు. ఫైర్ ఇంజన్లు వచ్చాయి కానీ వాటర్ లేవని, సిబ్బందికి సరైన మాస్కులు లేవన్నారు. అదే విధంగా.. అంబులెన్స్ లో ఆక్సిజన్ సిలిండర్ లేకపోవడం దురదృష్టకరమన్నారు.



సమగ్ర తెలుగు దినపత్రిక
అడుగు
The Step Towords The Truth..

# ఆటలు




## గుజరాత్ రికార్డు ఛేజింగ్..

గుజరాత్ జూలు విదిల్చింది. ఢిల్లీ క్యాపిటల్స్ తో జరిగిన మ్యాచ్ లో పది వికెట్లతో గెలుపొంది, దర్జాగా ప్లే ఆఫ్స్ కు చేరుకుంది. గుజరాత్ తో గెలుపుతో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు, పంజాబ్ కింగ్స్ కూడా నాకౌట్ కు అర్హత సాధించాయి. ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలో ఆదివారం జరిగిన ఈ మ్యాచ్ లో పది వికెట్లతో ఏక పక్ష విజయంతో ఢిల్లీని ఓడించింది. అంతకుముందు టాస్ ఓడి ఫస్ట్ బ్యాటింగ్ చేసిన ఢిల్లీ క్యాపిటల్స్ నిర్ణీత 20 ఓవర్లలో 3 వికెట్లకు 199 పరుగులు చేసింది. ఓపెనర్ కేఎల్ రాహుల్ (65 బంతుల్లో 112 నాటౌట్, 14 ఫోర్లు, 4 సిక్సర్లు) అజేయ సెంచరీతో సత్తా చాటాడు. అర్షద్ ఖాన్ పొదుపుగా బౌలింగ్ చేసి ఒక వికెట్ తీశాడు. అనంతరం ఛేజింగ్ ను కేవలం 19 ఓవర్లలో వికెట్లేమీ నష్ట పోకుండా 205 పరుగులు చేసింది. ఓపెనర్ సాయి సుదర్శన్ అజేయ సెంచరీ ( 61 బంతుల్లో 108 నాటౌట్, 3 ఫోర్లు, 7 సిక్సర్లు) ఐపీఎల్ కెరీర్లో రెండో సెంచరీతో సత్తా చాటాడు. తాజా విజయంతో 18 పాయింట్లతో పాయింట్ల పట్టికలో టాప్ లోకి జీటీ మళ్లీ వచ్చింది. టాస్ ఓడి ఫస్ట్ బ్యాటింగ్ చేసిన ఢిల్లీ స్లోగా స్టార్ట్ చేసింది. ఆరంభంలోనే ఫాఫ్ డుప్లెసిస్ (5) వికెట్ కోల్పోయి, కాస్త ఆత్మ రక్షణలో పడింది. ఈ దశలో రాహుల్ అభిషేక్ పోరెల్ (30) జంట జట్టును ఆదుకునే ప్రయత్నం చేసింది. ఓ ఎండ్ లో పోరెల్ దూకుడుగా ఆడగా, రాహుల్ కాస్త టైం తీసుకున్నాడు. ఆ తర్వాత తను కూడా రెచ్చిపోయి ఆడాడు. ఈ క్రమంలో వీరిద్దరూ రెండో వికెట్ కు 90 పర్నగులు జోడించాడు. ఈ క్రమంలో 35 బంతుల్లో రాహుల్ ఫిఫ్టీ పూర్తి చేసుకున్నాడు. ఆ తర్వాత పోరెల్ వెనుదిరిగినా, కెప్టెన్ అక్షర్ పటేల్ (25), ట్రిస్టన్ స్టబ్స్ (21 నాటౌట్) వేగంగా ఆడి, రాహుల్ కు మద్ధతుగా నిలిచారు. మరో ఎండ్ లో ఫిఫ్టీ తర్వాత గేర్ మార్చిన రాహుల్ వేగంగా ఆడి, ఐపీఎల్ లో ఐదో సెంచరీ పూర్తి చేశాడు. కాస్త భారీ టార్గెట్ తోనే బ్యాటింగ్ ప్రారంభించిన గుజరాత్ కు ఓపెనర్లు సుదర్శన్, కెప్టెన్ శుభమాన్ గిల్ (53 బంతుల్లో 93 నాటౌట్, 3 ఫోర్లు 7 సిక్సర్లు) మరో వికెట్ పడకుండా విజయాన్ని కట్టబెట్టారు. ఆరంభం నుంచి ఢిల్లీ బౌలర్లపై ఎదురు దాడికి దిగి, వారిని ఆత్మ రక్షణలో పడేశారు. ఓ ఎండ్ లో గిల్ యాంకర్ ఇన్నింగ్స్ ఆడగా, సుదర్శన్ మాత్రం ఆది నుంచి వేగంగా ఆడాడు. ఈ క్రమంలో 30 బంతుల్లో సుదర్శన్, 33 బంతుల్లో గిల్ ఫిఫ్టీ పూర్తి చేసుకున్నాడు. ఆ తర్వాత ఇరువురు గేర్ మార్చారు. ముఖ్యంగా సుదర్శన్ ఏ బౌలర్ ను లెక్క చేయకుండా సిక్సర్లతో విరుచుకు పడ్డాడు. ఈ నేపథ్యంలో 56 బంతుల్లో సెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఆఖర్లో తగినన్ని పరుగులు లేకపోవడంతో గిల్ కు సెంచరీ చేసే భాగ్యం దక్కలేదు. తను శతకానికి ఏడు పరుగుల దూరంలో నిలిచాడు. మరోవైపు వికెట్ పోకుండా అత్యధిక ఛేదన ఇదే కావడం విశేషం. ఈ విజయంతో గుజరాత్ తోపాటు ఆర్సీబీ, పంజాబ్ ప్లే ఆఫ్ కు చేరుకున్నాయి. దాదాపు 11 ఏళ్ల తర్వాత పంజాబ్ ప్లే ఆఫ్ కు చేరుకుంది. మూడు జట్లు నాకౌట్ కు చేరడంతో మిగతా ఒక బెర్త్ కోసం ముంబై ఇండియన్స్, లక్నో సూపర్ జెయింట్స్, ఢిల్లీ క్యాపిటల్స్ పోటీ పడుతున్నాయి.

## శ్రేయస్ అయ్యర్ అరుదైన ఘనత

పంజాబ్ కింగ్స్ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ అరుదైన ఘనతను సాధించాడు. 3 ఫ్రాంచైజీలను ఐపీఎల్ ప్లేఆఫ్‌కు తీసుకెళ్లిన మొదటి కెప్టెన్‌గా శ్రేయస్ నిలిచాడు. రాజస్థాన్ రాయల్స్‌తో జరిగిన కీలక మ్యాచ్‌లో పంజాబ్ కింగ్స్ విజయం సాధించి ప్లే ఆఫ్స్‌కు చేరుకుంది. దాదాపు దశాబ్దకాలం తర్వాత పంజాబ్ కింగ్స్ ప్లే ఆఫ్స్ లో ఆడనుంది. పంజాబ్ చివరిసారిగా 2014లో ప్లేఆఫ్‌కు చేరి ఫైనల్‌లో తలపడింది. అయితే, టైటిల్ మ్యాచ్‌లో కోల్‌కతా నైట్ రైడర్స్ చేతిలో ఓడిపోయింది.పంజాబ్ కింగ్స్‌కు మొదటిసారి నాయకత్వం వహిస్తున్న శ్రేయస్ అయ్యర్ జట్టును ప్లేఆఫ్స్‌కు తీసుకెళ్లాడు. గతేడాది కేకేఆర్ తరపున టైటిల్ గెలుచుకున్నాడు. 2020 సీజన్‌లో ముంబయి ఇండియన్స్‌తో జరిగిన ఫైనల్‌తో సహా రెండు సందర్భాల్లో దిల్లీ క్యాపిటల్స్‌ను ప్లేఆఫ్‌కు తీసుకెళ్లాడు. ఈ ఏడాది మెగా వేలానికి ముందే శ్రేయస్ కేకేఆర్‌ను విడిచిపెట్టాడు. గత సీజన్‌లో కోల్‌కతాకు టైటిల్‌కు వచ్చినప్పటికీ, తనకు తగిన క్రెడిట్ లభించలేదని శ్రేయస్ అన్నాడు. ఈ కారణం వల్ల ఐపీఎల్ 2025 మెగా వేలంలోకి ప్రవేశించాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం. వేలానికి ముందు పంజాబ్ కింగ్స్‌కు ఆస్ట్రేలియా బ్యాటర్ రికీ పాంటింగ్‌ను ప్రధాన కోచ్‌గా నియమించింది. ఇదివరకే దిల్లీ కేపిటల్స్ తరపున వీరి మధ్య భాగస్వామ్య ఉండడం వల్ల అయ్యర్‌ను కెప్టెన్‌గా తీసుకోవడానికి రికీ పాంటింగ్ ఆసక్తి చూపించాడు. ఐపీఎల్ 2025 మెగా వేలంలో పంజాబ్ కింగ్స్ రూ. 26.75 కోట్లకు శ్రేయస్‌ను కొనుగోలు చేసింది. దీంతో చరిత్రలో రెండో అత్యంత ఖరీదైన ఆటగాడిగా శ్రేయస్ నిలిచాడు. ఈ సీజన్‌లోని ఇతర ఖరీదైన ఆటగాళ్ల కాకుండా, అయ్యర్ కెప్టెన్‌గా, బ్యాటర్‌గా అంచనాలకు మించి రాణిస్తున్నాడు. ఇప్పటివరకూ ఆడిన 12 మ్యాచ్‌ల్లో శ్రేయస్ 48.33 సగటుతో 435 పరుగులు చేశాడు. ఈ సీజన్‌లో 174.70 స్ట్రైక్ రేట్‌తో 4 హాఫ్ సెంచరీలు చేసి నిలకడగా రాణిస్తున్నాడు. లఖనవూ సూపర్ జెయింట్స్ బ్యాట్స్‌మన్ నికోలస్ పూరన్ (34) తర్వాత ప్రస్తుత ఐపీఎల్ సీజన్‌లో అత్యధిక సిక్స్‌లు కొట్టిన రెండవ ఆటగాడిగా శ్రేయస్ (27) నిలిచాడు.ఈ సీజన్‌లో పంజాబ్ తొలి ఐపీఎల్ టైటిల్‌ను లక్ష్యంగా పరుగులు పెడుతోంది. ఇప్పటివరకూ ఆడిన 12 మ్యాచ్‌ల్లో 8 విజయాలతో 17 పాయింట్లు సాధించింది. ఇంకా 2 మ్యాచ్‌లు మిగిలి ఉండగానే ప్లేఆఫ్స్‌కు అర్హత సాధించడం గమనార్హం. ఫైనల్‌కు చేరుకునే అవకాశాన్ని మెరుగుపరచడానికి పాయింట్ల పట్టికలో మొదటి రెండు స్థానాల్లో నిలవాలని పంజాబ్ లక్ష్యంగా చేసుకుంది. శ్రేయస్ అయ్యర్ పంజాబ్ కింగ్స్‌కు తమ తొలి టైటిల్‌ను అందించగలరా లేదా అని క్రికెట్ అభిమానులు వేచి చూస్తున్నారు.





## ఆసియా కప్ నుంచి భారత్ ఔట్?

పహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్‌తో భారత్, పాకిస్థాన్ మధ్య తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్న క్రమంలో బోర్డ్ ఆఫ్ కంట్రోల్ ఫర్ క్రికెట్ ఇన్ ఇండియా- బీసీసీఐ కీలక నిర్ణయం తీసుకున్నట్లు వార్తలు వచ్చాయి. ఈ క్రమంలో బీసీసీఐ క్లారిటీ ఇచ్చింది ఆ వార్తలను ఖండించింది.కాగా, అంతకుముందు ఈ ఏడాది జరిగే ఆసియా కప్ టోర్నీ నుంచి వైదొలగాలని నిర్ణయించినట్లు వార్తలు వచ్చాయి. బీసీసీఐ వర్గాలను ఉటంకిస్తూ పలు ఆంగ్ల మీడియా సంస్థలు కథనాలు వెల్లడించాయి. దీనిపై ఇప్పటికే ఆసియా క్రికెట్ మండలి (ఏసీసీ)కి భారత బోర్డు సమాచారం ఇచ్చినట్లు సదరు కథనాలు పేర్కొన్నాయి. తద్వారా ఈ ఏడాది సెప్టెంబరులో జరిగే పురుషుల ఆసియా కప్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ అయిన భారత జట్టు ఆడే అవకాశాలు లేనట్లు చెప్పాయి. ఇక, జూన్‌లో జరిగే మహిళల ఎమర్జింగ్ టీమ్స్ ఆసియా కప్ నుంచి కూడా వైదొలగాలని బీసీసీఐ నిర్ణయించినట్లు కథనాలు వెలువడ్డాయి. ఈ నేపథ్యంలో బీసీసీఐ సెక్రటరీ దేవజిత్ సైకియా క్లారిటీ ఇచ్చారు."ఈరోజు ఉదయం నుంచి, ఆసియా కప్ మరియు ఉమెన్స్ ఎమర్జింగ్ టీమ్స్ ఆసియా కప్‌లో పాల్గొనకూడదని %దీజజ×% నిర్ణయించినట్లు కొన్ని వార్తల నివేదికలు మా దృష్టికి వచ్చాయి. అలాంటి వార్తల్లో ఎలాంటి నిజం లేదు. %దీజజ×% తదుపరి %ూజజ% ఈవెంట్‌ల గురించి చర్చించలేదు లేదా అలాంటి చర్యలు తీసుకోలేదు. %ూజజ%కి ఏం లేఖ రాయడం గురించి కూడా చెప్పలేదు. ఈ దశలో, మా ప్రధాన దృష్టి ఐపీఎల్, పురుషులు- మహిళల తదుపరి ఇంగ్లాండ్ సిరీస్‌లపై ఉంది." అని క్లారిటీ ఇచ్చారు. అంతకుముందు, జమ్ముకశ్మీర్‌లోని పహల్గాం ఉగ్ర దాడిలో ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు చెలరేగాయి. ఈ నేపథ్యంలో పాకిస్థాన్ క్రికెట్‌ను ఏకాకిని చేయాలనే ఉద్దేశంతోనే బీసీసీఐ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఇంటర్నేషనల్ క్రికెట్ ఈవెంట్లకు ఉన్న స్పాన్సర్లలో ఎక్కువ మంది భారత్‌కు చెందిన వారే. కాగా, భారత్-పాకిస్థాన్ మధ్య మ్యాచ్ లేకుండా ఆసియా కప్ ఉంటే, దాన్ని ప్రసారం చేసేందుకు బ్రాడ్‌కాస్టర్లు కూడా అంత ఆసక్తి చూపించే అవకాశాలు కనిపించడం లేదు. దీంతో టీమ్ఇండియా లేకుండా ఆసియా కప్ టోర్నీని నిర్వహించడం అనేది సరైన నిర్ణయం కాదని ఏసీసీ భావించే అవకాశం ఉందని బీసీసీఐ వర్గాల అభిప్రాయపడ్డట్లు వార్తలు వచ్చాయి. 2023 ఆసియా కప్ ఎడిషన్‌పైనా భారత్-పాకిస్థాన్ సంబంధాలు ప్రభావం చూపిచాయి. ఆ ఎడిషన్‌లో టోర్నీకి పాకిస్థాన్ ఆతిథ్యమిచ్చింది. ఆ దేశానికి వెళ్లేందుకు బీసీసీఐ ఒప్పుకోలేదు. దీంతో శ్రీలంక వేదికగా భారత్ మ్యాచ్‌లను ఏర్పాటు చేశారు. మామూలుగానే ఇండియా-పాకిస్థాన్ మధ్య ద్వైపాక్షిక సిరీస్‌లు జరగట్లేదు. కేవలం ఐసీసీ టోర్నీల్లోనే ఆడుతున్నాయి. ఇప్పుడు ఆసియా కప్ నుంచి వైదొలగాలని బీసీసీఐ నిర్ణయించిన నేపథ్యంలో టోర్నీని వాయిదా వేసే అవకాశాలు ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి.

# సినిమా

సమగ్ర తెలుగు దినపత్రిక
అడుగు
The Step Towords The Truth..



## త్వరలో ఓ ఇంటివాడు కాబోతున్న విశాల్

హీరో విశాల్ త్వరలో ఓ ఇంటివాడు కాబోతున్నారు. నటి సాయి దన్నికను ) ఆగస్టు 29న పెళ్లాడమన్నారు. కటుల సంఘం కార్యదర్శిగా ఉన్న విశాల్ సుఘు భవరం ప్రారంబోత్సవం తర్వాత వివాహం చేసుకోనున్నట్లు ఇప్పటికే పెళ్లి దర్భలు కూడా పూర్తయినట్లు ఇటీవల తెలిపారు. ఇది ప్రేమ వివాహమే ఇచ్చారు. ఈ నేపథ్యంలో సాయి ధన్బికను ఆయన వెల్లడమన్నారంటూ సోమవారం వార్తలు చక్కర్లు కొట్టాయి. వాటిని సాయి ధనిక, విశాల్ ధృవీకరించారు. సాయి ధన్సిక నటించిన 'యోగి' చిత్రం ఆడియో విడువల చెన్నైలో సోమవారం జరగగా కార్యక్రమ వేదికగా ఈ విషయాన్ని ప్రకటించారు. ఆగస్టు వేసిన తమ వివాహం జరగనుందని విశాల్ అనుమతితో సాయి ధర్బార ప్రకటించగా, ఆమె తల్లితండ్రుల సమ్మతితో ఈ విషయాన్ని వెల్లడిస్తున్నట్లు అదే కార్యక్రమంలో పాల్గొన్న విశాల్ పేర్కొన్నారు. ఆగస్టు 23న విశాల్ పుట్టిన రోజు కావడం గమనార్హం

## కృష్ణ కుటుంబం నుంచి మరో నటుడు

### తెరంగేట్రానికి సిద్ధంగా రమేశ్ బాబు తనయుడు జయకృష్ణ

సూపర్ స్టార్ కృష్ణ కుటుంబం నుంచి మరో నటుడు అరంగేట్రం చేయబోతున్నాడు. పెద్ద కుమారుడు, రమేష్‌బాబు తనయుడు జయకృష్ణ హీరోగా పరిచయం కానున్నారని, గత కొంతకాలంగా వార్తలు చక్కర్లు కొడుతున్న విషయం తెలిసిందే. తాజాగా సోషల్ మీడియాలో జయకృష్ణకు సంబంధించిన ఓ ఫొటో షూట్ బయటకు రావడంతో ఆ వార్తలకు మరింత బలం చేకూరింది. బ్లాక్‌సూట్‌లో మెస్మరైజింగ్‌లో లుక్‌లో కనిపించిన ఫొటోలు ఇప్పుడు వైరల్ అవుతున్నాయి. కాగా జయకృష్ణ లండన్‌లో నటనలో ప్రొఫెషనల్ -ట్రైనింగ్ తీసుకున్నాడు. అయితే తాజాగా జయకృష్ణను తెలుగు చిత్రసీమలో ఆవిష్కరించేందుకు దర్శకుడు సిద్ధం అయ్యాడు. ఆర్ఎక్స్ 100', 'మంగళవారం' లాంటి చిత్రాలతో బోల్డ్ డైరెక్టర్‌గా గుర్తింపు తెచ్చుకున్న అజయ్ భూపతి దర్శకత్వం జయకృష్ణ ఎంట్రీ ఇవ్వనున్నట్లు- సమాచారం.



వైజయంతీ మూవీస్, ఆనంది ఆర్ట్స్ ఈ ప్రాజెక్ట్‌ను సంయుక్తంగా నిర్మించనున్నాయి. అంటే ఈ భారీ ప్రాజెక్ట్‌ను ఇద్దరు ప్రముఖ నిర్మాతలు సంయుక్తంగా నిర్మించనున్నారని తెలుస్తోంది. అయితే అజయ్ భూపతి మాత్రం ప్రస్తుతం 'మంగళవారం 2'తో బిజీగా ఉన్నప్పటికీ, జయకృష్ణ డెబ్యూ సినిమాను కూడా త్వరలో సెట్స్‌పైకి తీసుకెళ్లే ఆలోచనలో ఉన్నాడట. కాగా ఈ సినిమా కథ యాక్షన్, ఎమోషన్ తో యువతను ఆకర్షించేలా ఉంటుందని అంటున్నారు. అంతే కాదు మహేష్ బాబు ఈ ప్రాజెక్ట్‌ను దగ్గరుండి చూస్తూ, కొన్ని నిర్మాణ అంశాల్లో కీలక సలహాలు ఇస్తున్నాడని సమాచారం.

### మహాభారతంలో కృష్ణుడి పాత్రచేయాలని ఉంది

జూనియర్ ఎన్టీఆర్ పెద్ద ప్రాజెక్టులతో ఫుల్ బిజీగా ఉన్నాడు. దేవర మూవీతో మంచి హిట్ అందుకున్న ఆయన.. ఇప్పుడు ప్రశాంత్ నీల్ డైరెక్షన్ లో భారీ సినిమా చేస్తున్నాడు. డ్రాగన్ అనే పేరు పరిశీలనలో ఉంది. ప్రస్తుతానికి షూటింగ్ జరుగుతోంది. తర్వత దేవర-2, ఆ తర్వాత నెల్సన్ తో మూవీ ఉండొచ్చు. ఎన్టీఆర్ అంటే నటనకు మారుపేరు. ఎలాంటి పాత్రలో అయినా ఒదిగిపోవడం ఆయనకు చాలా సులువు. ఎన్టీఆర్ నటనను ఎంతో మంది డైరెక్టర్లు మెచ్చుకున్నారు. ఇప్పటికే ఎన్నో వైవిధ్య భరితమైన పాత్రల్లో నటించి మెప్పించాడు ఎన్టీఆర్. అలాంటి నటన కనబరిచే ఎన్టీఆర్ డ్రీమ్ రోల్ ఏంటో చాలా మందికి తెలియదు. ఎన్టీఆర్ కు ఉన్న ఒకే ఒక్క డ్రీమ్ రోల్ మహాభారతంలో కృష్ణుడి పాత్ర చేయడం. ఆ విషయంలో గతంలో కూడా బయటపెట్టాడు ఎన్టీఆర్. దర్శక ధీరుడు రాజమౌళి మహాభారతం సినిమాను తీస్తానని గతంలోనే ప్రకటించాడు. కాకపోతే దానికి చాలా సమయం పడుతుందన్నాడు. ఒకవేళ జక్కన్న ఈ మూవీ తీస్తే అందులో ఎన్టీఆర్ డ్రీమ్ రోల్ లో నటిస్తాడేమో చూడాలి. ప్రస్తుతానికి ప్రశాంత్ నీల్ సినిమాతో ఫుల్ బిజీగా గడిపేస్తున్నాడు జూనియర్. మొన్ననే ట్రిబుల్ ఆర్ కాన్సర్ట్ లో పాల్గొని వచ్చాడు. ఇప్పుడు కర్ణాటకలో డ్రాగన్ షూటింగ్ లో పాల్గొంటు-న్నాడు.



## త్వరలోనే నంది అవార్డుల పునరుద్ధరణ


### చిత్ర పరిశ్రమ అభివృద్ధికి చర్యలు తీసుకుంటాం
### మంత్రి కందుల దుర్గేశ్ వెల్లడి

ఆంధ్రప్రదేశ్‌లో రాబోయే రోజుల్లో సినిమా పరిశ్రమ అభివృదంది కోసం అవసరమైన ప్రణాళికలు సీఎం చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నేతృత్వంలో రచిస్తున్నామని ఏపీ పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. భైరైవం ట్రైలర్ విడుదల కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా దుర్గేశ్ మాట్లాడుతూ.. ఏపీలో అద్భుతమైన అందాలున్నాయి. ఇక్కడ సినిమా షూటింగ్‌లు జరుగుతున్నాయి. ఇంకా మౌలిక సదుపాయాలను అభివృద్ధి చెందాల్సి ఉంది. దానికి సంబంధించి స్టూడియోల నిర్మాణం, డబ్బింగ్, రీరికార్డింగ్ థియేటర్లు నిర్మించడానికి అవసరమైన మద్దతు ఇవ్వడానికి పాలసీ తెచ్చే ఆలోచనలో ప్రభుత్వం ఉంది. రాబోయే రోజుల్లో హైదరాబాద్ మాదిరిగానే విశాఖపట్నం అభివృద్ధి చేస్తాం అని అన్నారు. చాలాకాలంగా మూలన పడిపోయిన నంది అవార్డులను పునరుద్ధరిస్తాం. అతి తర్వలో ఆ అవార్డులకు సంబంధించి ప్రకటన ఇస్తాం. పరిశ్రమకు చెందిన ముఖ్యమైన నిర్మాతలు, దర్శకులు, నటులతో సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. నూటికి నూరు శాతం సినిమా పరిశ్రమ అభివృద్ధికి కృషి చేస్తాం అని అన్నారు. ఇదిలావుంటే భైరవం' సినిమాతో తెలుగు ప్రేక్షకులను పలకరించేందుకు వస్తున్నానని నటి అదితి శంకర్ అన్నారు. బెల్లంకొండ సాయి శ్రీనివాస్, నారా రోహిత్, మంచు మనోజ్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'భైరవం'. విజయ్ కనకమేడల దర్శకుడు. కె.కె.రాధామోహన్ నిర్మించారు. ఈ సినిమాలో మరో ఇద్దరు కథానాయికలుగా ఆనంది, దివ్య పిళ్ళై నటించారు. మే 30న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా నిర్వహించిన ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో అదితి శంకర్ మాట్లాడారు.

## ఆర్ముగ్‌కుమార్ ఆదుకోవడంతోనే ఈ స్థాయిలో ఉన్నా

తమిళ స్టార్ హీరో విజయ్ సేతుపతి గురించి ప్రత్యేకించి చెప్పక్కర్లేదు. విలక్షణ నటుడిగా అన్ని భాషల్లోనూ మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. హీరోగా మాత్రమే కాకుండా ఎలాంటి పాత్ర అయిన పడించగల సతా ఉన్నవాడు. ముఖ్యంగా విలన్‌గా విజయ్ యాక్టింగ్‌కి విపరీతమైనా ఫ్యాన్ ఫాలోయింద్ ఉంది. ప్రస్తుతం 'ఏస్'సినిమాతో ప్రేక్షకుల ముందుకు రానున్న విజయ్ తాజాగా ఆయన ఓ ఇంటర్వ్యూలో తన కెరీర్ తొలి రోజుల్ని గుర్తుచేసుకున్నారు. విజయ్ మాట్లాడుతూ.. ' కెరీర్ ఆరంభంలో అవకాశాల కోసం ఎదురు చూస్తున్న తరుణంలో 'వర్ణం' అనే సినిమాకు ఆడిషన్‌కు వెళ్లాను. తీరా అక్కడికి వెళ్లాక సీన్ చెప్పి డైలాగులు కూడా నన్నే రాసుకొని నటించమన్నారు. అప్పుడే తెలుసుకున్న నేను డైలాగులు కూడా రాయగలనని. ఆర్ముగ కుమార్ ఆ టీమ్‌కు నా పేరు సజెస్ట్ చేశారు.

అలా ఆ సినిమాలో అవకాశం వచ్చింది. అలాగే క్లాసిక్ మూవీ '96'లో నేను నటించడానికి కూడా ఆయనే కారణం. 'ఒకసారి ఈ సినిమాకు విజయ్ సేతుపతి ఆడిషన్ తీసుకోండి. పాత్రకు సరిపోడు అనుకుంటే తిరస్కరించండి' అని ఆర్ముగ కుమార్ '96' టీమ్‌కు చెప్పారు. మనం అంటూ ఒక స్థాయి వచ్చాక ఎవరైనా సహాయం చేయడానికి ముందుంటారు. కానీ మనం ఎవరో తెలియనప్పుడు కూడా సహాయం చేయడం గొప్ప. ఆ సాయం చీకటితో నిండిన ఇంట్లో దీపం వెలిగించడం లాంటింది. అలా నా జీవితంలో ఆ దీపాన్ని వెలిగించిన మనిషి ఆర్ముగ కుమార్. అతడికి ఎప్పటికీ రుణపడి ఉంటాను' అని విజయ్ సేతుపతి అన్నారు.



## బాలనటుడు భరత్‌కు మాతృవియోగం

టాలీవుడ్ నటుడు, చైల్డ్ ఆర్టిస్ట్ మాస్టర్ భరత్ ఇంట విషాదం నెలకొంది. ఆయన తల్లి కమలహాసిని ఆదివారం రాత్రి చెన్నైలో గుండెపోటుతో మరణించారు. ఆమె అకాల మరణంతో భరత్ తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యాడు. ఈ విషయాన్ని కుటంబ సభ్యులు సోషల్ మీడియా వేదికగా తెలిపారు. ఈ నేపథ్యంలో సినీ ప్రముఖులు, సన్నిహితులు ఆయనకు ఫోన్ చేసి ధైర్యం చెబుతున్నారు. బాల నటుడిగా మంచి గుర్తింపు తెచ్చుకున్న భరత్.. ప్రస్తుతం పలు చిత్రాల్లో కీలక పాత్రల్లో నటిస్తూ మెప్పిస్తున్నారు.తెలుగులో అంజి సినిమాతో కెరీర్ ప్రారంభించాడు. రెడీ, ఢీ, దూకుడు, హ్యాపీ, దేనికైనా రెడీ ఇలా తెలుగు, తమిళ భాషల్లో వందకుపైగా సినిమాల్లో నడించాడు. రెడీ, బిందాస్ సినిమాల్లో నటనకుగాను నంది అవార్డులు అందుకున్నాడు.

Printed, Published & Owned by Margam Rama on behalf of ADUGU DIGITAL MEDIA Pvt. Ltd, Printed and Published at ADUGU PRESS, H No: 7-120, PALAKURTHI Village & Mandal, Jangaon District, Telangana, PIN: 506146. Chief Editor: Dr.Margam Lakshmi Narayana, Ph.No. : 8499990005